# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 26 జూలై 2023


## రాజంపేటలో ఎడతెరపిలేకుండా వర్షం
### జలమయమైన రోడ్లు



రాజంపేట అర్బన్, జులై 25 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రాజంపేట నియోజకవర్గవ్యాప్తంగా ఒక మోస్తరు వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి జల్లులతో ప్రారంభమైన వర్షం మంగళవారం ఉదయం నుంచి ఎడతరపిలేకుండా కురుస్తూనే ఉంది. సాయంత్రం 5.30 గంటల సమయంలో జోరుగా వర్షం కురిసింది. 2 సెం.మి. మే వర్షం పడినట్లు తెలుస్తోంది. ఇకపోతే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 2 నెలలు కావస్తున్నా పదును వర్షం లేకుండా వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలకు అల్పపీడనం ఊరటనిచ్చింది. భూగర్భజలాలు ఈ వర్షంతో పెరగకపోయినా పంటల సాగుకు దుక్కులు దున్నుకునేందుకు కలిసొచ్చినట్లేనని రైతులు వాపోతూన్నరు. ఇక 3 రోజుల పాటు వర్షం అవకాశాలు ఉండడంతో రైతులకు ఉపశమనం ఇచ్చే అవకాశం ఉంది.

## 11 మంది జూదరులు అరెస్ట్
### రూ.1.48లక్షలు స్వాధీనం



పేకటరాయుళ్ల అరెస్ట్ చూపుతున్న డిఎస్పీ

మదనపల్లెక్రైం, జూలై 25

ప్రభాతవార్త :

మదనపల్లె పట్టణంలోని ఓ లాడ్జీలో పేకాట ఆడుతున్న 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు మదనపల్లె డిఎస్పి కేశప్ప తెలిపారు. మంగళవారం రామరావు కాలనీ బైపాస్ రోడ్డులో వున్న అక్షయ లాడ్జీలో కొంద రూ పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావటంతో డిఎస్పీ కేశప్ప, ఒకటవ పట్టణ సిఐ మహబూబ్‌బాషాలు సిబ్బందితో వెళ్లి దాడు లు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మందిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.1.48లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ, సిఐలు తెలిపారు. ఆసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు.

## అన్నమయ్య జిల్లాలో విస్తారంగా వర్షాలు..!

**- నిరాఘాటంగా కురుస్తూనే ఉన్న వర్షం - చెరువులకు.. కుంటలకు చేరుతున్న సాగునీరు**

**- వృద్ధి చెందుతున్న భూగర్భజలాలు - సరిపడ సాగునీరు చెరువులకు చేరితేనే ఆయకట్టుకు ప్రయోజనం**

**- ఖరీఫ్‌పై రైతన్నల్లో చిగురిస్తున్న ఆశలు**

(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)

జీవరాశులకు వాయువు ఎంత ముఖ్యమో.. నీరు అంత ముఖ్యం. వాన రాక.. ప్రాణం పోక ఎవ్వరికి ఎరుక.. జలం అమృత తుల్యం. వ ృధా చేస్తే చెల్లించక తప్పదు మూల్యం. జలనిధి మానవాళి మనుగడకు పెన్నిధి. మనం చేసే తప్పు భవితకు పెనుముప్పు... ప్రపంచంలోని శాస్త్రవేత్తలు నీటికొరత తన్నుకొస్తుంది.. జలాన్ని భద్రంగా వాడుకోవడం ముఖ్యమంటూ గగ్గోలు పెడుతున్నారు. అయినా అన్నమయ్య జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి వ్యవసాయానికి సాగునీరు అందించే అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జూన్ నెల నుండి అక్టోబర్ వరకు సాగయ్యే పంటలను ఖరీఫ్ కాలమంటారు. ఈ వర్షాలు నిరాఘాటంగా పడుతున్నాయి. వర్షాలు మరో మూడు రోజులుండే అవకాశాలున్నాయని వాతావరణశాఖ తెలియజేసింది. ప్రస్తుతం వర్షాలతో భూగర్భజలాలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో బావులు, బోర్ల క్రింది రైతులకు ఈ ఖరీఫ్‌లో సాగునీటి సమస్యలు తీరినట్టే. రానున్న రోజుల్లో పడే వర్షాల ఆధారంగా చెరువులు, కుంటల్లోకి వచ్చే సాగునీటిని బట్టి ఆయకట్టు రైతుల ప్రయోజనాలు ఆధారపడి ఉండనున్నాయి. దీంతో జిల్లాలో ఖరీఫ్‌పై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ జిల్లాలో వరి, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, ప్రత్తి, తమలపాకులు ప్రముఖ వ్యవసాయ ఉత్పత్తులు కాగా, మామిడి, బొప్పాయి, అరటి, నిమ్మ, బత్తాయి ప్రముఖ ఉద్యానవన పంటలు. 32 మండలాలతో కూడిన అన్నమయ్య జిల్లా దక్షిణ ఆగ్రో క్లైమాటిక్ జోన్‌లో ఉన్నందున సాధారణ వర్షపాతం 700 మి.మీ. జిల్లాలో నైరుతి రుతుపవనాలు ద్వారా 394 మి.మీ., ఈశాన్య రుతుపవనాల ద్వారా 251 మి.మీ. వర్షపాతం సాధారణంగా పడుతుంది. తుఫాన్ ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షంతో జిల్లాలో చెయ్యేరు, పెన్నా, గుంజన, పుల్లంగేర్ల ప్రవాహం మొదలైంది. ఇప్పటికే రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో చాలా చెరువులు, కుంటల్లోకి వర్షపునీరు కొద్దికొద్దిగా చేరడం మొదలైంది. విస్తారంగా పడుతున్న వర్షాలతో మొత్తానికి రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తపరుస్తున్నారు. జిల్లాలో 2000 ఎకరాలకు పైగా సాగునీటిని అందించే అతి పెద్ద చెరువైన రాజంపేట మండలంలోని పోలిచెరువుతో పాటు 100 ఎకరాల వరకు సాగయ్యే కుంటల వరకు ఆయకట్టు ఉంది. నదుల ఆధారంగా ఊటకాల్వలు కూడా అనేకమున్నాయి. అయితే జిల్లాలో చాలా చెరువులకు సాగునీటిని తీసుకొచ్చే కాలువలు సరిగ్గా లేవని, వెంటనే ఇరిగేషన్ అధికారుల స్పందించకుంటే వర్షాల వల్ల చెరువులకు వచ్చే సాగునీరు పక్కదారులు పట్టే ప్రమాదముందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. కనుక ఇరిగేషన్ ఉన్నతాధికారుల సత్వరం స్పందించి అన్ని చెరువులకు, కుంటలకు సాగునీటిని తీసుకొచ్చే కాలువల విషయంలో అవసరమైన చోట మరమత్తులకు చర్యలు గైకొనాల్సి ఉంది.



## అన్నదాతకు అండగా ప్రతి ఏటా రైతుఖాతాల్లోకి ఆర్థికసాయం

**అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి - రాయలసీమకు తాగుసాగునీరు అందించడమే లక్ష్యం**

**ఇంటింటికి నల్లారి కార్యక్రమంలో కిశోర్‌కుమార్‌రెడ్డి స్పష్టం**



ఇంటింటికి నల్లారి కార్యక్రమంలో మాట్లాడుతున్న జాతీయప్రదాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు, జూలై 25 ప్రభాతవార్తః

పట్టణంలోని కోటపల్లె, జీవి చంద్రశేఖర్‌రెడ్డి నగర్, రోజా ప్లాట్సు తదితర ప్రాంతాల్లో ఇంటింటా నల్లారి కార్యక్రమం పదవ రోజు తెదేపా పీలేరు నియోకవర్గ బాధ్యులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో కలిసి తెదేపా నాయకులు ప్రారంభించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో రైతులకు అండగా ఉంటామని వారి ఖాతాల్లోకి ప్రతి ఏటా " అన్నదాత" పథకం ద్వారా రూ.20వేలు చొప్పున ఐదేళ్లకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించడమే తెదేపా ప్రధాన లక్ష్యమన్నారు. రైతులకు, మహిళలకు, తెదేపా మేనిఫెస్టోలో పథకాల గురించి వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. నదుల అనుసంధానం పేరిట గోదావరి మిగులు జలాలను రాయలసీమకు రప్పించి సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా రాయలసీమ రైతులకు తెదేపా అండగా ఉంటుందన్నారు.రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసి రాష్ట్ర రైతుల జీవనాడి , పోలవరం పూర్తిచేస్తామని తెలిపారు. టెక్నాలజీ వ్యవసాయం అనుసంధానం, రైతులకు సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ బోర్లతోపాటు, సీడ్సు కార్పోరేషన్ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అన్ని విధాల రైతులను ఆదుకుంటామన్నారు. 2024లో తెదేపా మేని ఫెస్టోలో రైతులకు 9 గంటలకు నాణ్యమైన విద్యుత్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆంధ్రప్రదేశ్ పంపుసెట్లు ఉపయోగిస్తున్న 18 లక్షల మంది రైతలకు ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత నారా చంద్రబాబునాయుడిదేనని స్పష్టం చేశారు. రైతులను ఆదుకోలేని ప్రభుత్వాలు అధికారం చేపట్టినట్లు చరిత్రలో లేదని రైతుల్ని విస్మరిస్తే ప్రభుత్వాలు పేక మేడల్లా కూలిపోతాయని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారాలంటే 2024లో తెదేపా ధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఈకార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి బాబు రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు మల్లెల రెడ్డిబాషా,మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ సాధికారకమిటీ కార్యదర్శి పురం రామ్మూర్తి, యల్లెల రెడ్డెప్పరెడ్డి, మాజా మండలాధ్యక్షులు అమరనాధరెడ్డి, దళవాయి సురేష్‌కుమార్‌రెడ్డి (కంచెసూరి) ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, శ్రీనాధరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, గిరీష్, చంద్రశేఖర్, శివశంకర్, జయన్న, కష్ణయ్య, తెలుగుయువత అధ్యక్షులు నల్లారి రియాజ్, లక్ష్మీ ప్రసాద్, ఫైరోజ్, మైనారిటీ నాయకులు చాన్‌బాసా, ఫోకత్, ఖాదర్, పురుషోత్తంరెడ్డి, హనీఫ్, రెడ్డిబాషా, గాజుల రవికుమార్, రైతు సంఘ నాయకులు అమరనాధరెడ్డి, యువత అదికార ప్రనతినిధి బుజ్జి, స్పోర్ట్సు మల్లి, బీసీ అధ్యక్షులు వసంతలరాజా, విజయ్‌కుమార్, మహమ్మద్‌పీర్, మస్తాన్, సీనియర్ నాయకులు జాఫర్, సుబ్బయ్య, ఖాజాపీర్, రెడ్డిముని, బాబు రమేష్, రాజా మహేష్, అబ్దుల్లా, రహంతుల్లా, అప్పస్వామి రమాదేవి, అనూరాధ, లక్ష్మీ, కాంతమ్మ, అమరనాధరెడ్డి , చందర్రయ్య, శివ, సోనిబాషా, మహేష్, మంజు, షరీఫ్, సురేష్, క్రాంతి, నాగరాజు, రవినాయక్, వెంకటరమణనాయక్, శేఖర తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**రైతులందరూ ప్రైమరీ ప్రాజెసింగ్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**కలెక్టర్ గిరీష పి.ఎస్, ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి**





మదనపల్లె, జూలై 25 ప్రభాతవార్త :

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి అన్నమయ్య జిల్లా, బి కొత్తకోట మండలం, తుమ్మనగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ కేంద్రాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. బి.కొత్తకోట మండలం, ఎంపీడీవో కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు కలెక్టర్ గిరీష పిఎస్, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో మురళి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేడు వర్చువల్ విధానం ద్వారా బి.కొత్తకోట మండలం తుమ్మనగుట్ట గ్రామంలో మొట్టమొదటిసారిగా టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో శుభపరిణామమన్నారు. రైతులందరూ టమోటా ప్రాసె సింగ్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభి వృద్ధి చెందాలన్నారు. ఈ పిపిసిలో అన్ని రకాల వెజిటేబుల్స్‌ను ఇక్కడే ప్రాసెసింగ్ చేయడం జరుగు తుందని ఇందులో దాదాపు 25 మందికి నేరుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పీపీసీ ఎఫ్పిఓ ద్వారా రైతులకు నేరుగా ఇన్పుట్, మార్కెటింగ్ ఇం టర్వెన్షన్స్ చేయడంతోపాటు ప్రాసెసింగ్ చేసిన వెజిటబుల్స్‌ను ట్రాన్స్పోర్ట్ చేయడం జరుగుతుంద న్నారు. పిపిసి ద్వారా ప్రతి గంటకి ఒకటిన్నర టన్నుల టమోటా ప్రాసెసింగ్ జరుగుతుందన్నారు. మరియు 250 మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు పెట్టడం జరిగిందన్నారు. గతంలో తంబళ్లపల్లె నియోజకవర్గం ప్రజలు మదనపల్లెకు వెళ్లి దాదాపు 30 -40 కిలోమీటర్లు ప్రయాణం చేసేవారని ప్రస్తుతం ఇప్పుడు టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల ఆ ఖర్చులేవీ రైతులకు ఉండవన్నారు. యూనిట్ ప్రెసిడెంట్, సీఈఓ ఆధ్వర్యంలో రైతులకు అవసరం మేరకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతుల కోరిక మేరకు అన్నమయ్య జిల్లాలో ఇంకా అదనంగా మొలకలచెరువు మరియు రామసముద్రంలలో రెండు చోట్ల ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. వీటిని నిర్మాణ పనులు జరుగుతున్నాయని త్వరలో ఈ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన హామీలు రెండింతలు నెరవేర్చడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అంటే తంబళ్లపల్లె నియోజకవర్గం ప్రజలకు ఎంతో అభిమానం అని ఈ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రిపై ఎంత నమ్మకం పెట్టుకున్నారన్నారు. దీంతో గతంలో ఎప్పుడూ ఎన్నడూ లేని విధంగా రైతుల కోసం ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేయడం ప్రతి ఒక్కరూ ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఇలాంటి ప్రభుత్వం పది కాలాలపాటు ఉండేటట్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యులు పంజం సుకుమార్ రెడ్డి, బికొత్తకోట మండలం, తుమ్మనగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ కేంద్రానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, తాసిల్దారు రఫిక్ అహ్మద్, ఎంపీడీఓ శంకరయ్య,ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జడ్పిటిసి రామచంద్ర పాల్గొన్నారు.

## కూరగాయాల మార్కెట్‌లో చినుకుపడితే చిత్తడే

**బురదమయంగా మారిన కూరగాయల మార్కెట్**

**మార్కెట్‌లో కనీస వసతులు ఏర్పాటు చేయాలంటున్న వ్యాపారస్తులు**



కూరగాయల మార్కెట్‌లోకి బురదలోనే వెళ్తున్న దృశ్యం.

బద్వేలు అర్బన్, జూలై 25 ప్రభాతవార్త :

కొద్దిపాటి వర్షానికే కూరగాయల మార్కెట్‌లోకి కొనుగోలుదారులు వెళ్ళాలంటే అక్కడ స్తంభించిన వర్షపు నీటిలో కాలు కింద పెడితే ఎక్కడ జారి పడిపోతామో అనే భయాందోళనలో పలువురు ప్రజలు వాపోతున్నారు. నిరంతరం అవసరమయ్యే కూరగాయలు కొనుగోలుకు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలందరూ మార్కెట్‌లోకి వెళ్ళి కూరగాయలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండగా వర్షాలు పడినపుడు మార్కెట్‌లోకి ప్రజలు వెళ్ళాలంటే వర్షపు నీటిలోనే వెళ్ళి కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లోకి వెళ్ళాలంటే ఒక పక్క కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయని, మరో పక్క వర్షపు నీటిలో మార్కెట్‌లోకి వెళ్ళలేక ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్‌లో ఒక్కసారిగా అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో వ్యాపారస్తులు కూడా కొనుగోలుదారులు రాక మార్కెట్ అంతా బోసిపోయింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ చొరవచూపి కూరగాయల మార్కెట్‌లో అవసరమైన మౌళిక వసతులను ఏర్పాటు చేయాలని పలువురు ప్రజలు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

**మార్కెట్‌లో కనీస వసతులు ఏర్పాటుచేయాలి :**



కూరగాయల మార్కెట్‌లో మున్సిపల్ శాఖ అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ కనీస వసతులు ఏర్పాటు చేసి వర్షా కాలంలో కొనుగోలు దారులకు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలి. కొద్దిపాటి వర్షానికే మార్కెట్‌లో వర్షపు నీరు స్తంభించడంతో కొనుగోలు దారులు మార్కెట్‌లోకి రావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున మార్కెట్‌లో కనీస వసతులను అధికారులు కల్పించాలి.

- షేక్ ఖాదర్ బాష, కూరగాయల వ్యాపారి.

**కొద్దిపాటి వర్షానికే మార్కెట్‌లో అవస్థలు :**



కూరగాయల మార్కెట్‌లో కొద్దిపాటి వర్షం పడితే మార్కెట్‌లో నీరంతా స్తంభించి రాత్రి సమయంలో దోమల వ్యాప్తితో వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా కూరగాయలు కొనుగోలు చేసేందుకు ప్రజలు మార్కెట్‌లోకి రావాలన్నా బురదలోనే రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కావున మార్కెట్‌లో గత 10 సంవత్సరాలుగా కనీస వసతులు లేక ప్రతి సంవత్సరం వర్షా కాలంలో వ్యాపారస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కావున నాయకులుగానీ, అధికారులుగానీ కూరగాయల మార్కెట్‌లో కనీస వసతులు ఏర్పాటు చేసి ఇబ్బందులు కలగకుండా చూడాలి.

- మాబు షరీఫ్, కూరగాయల వ్యాపారి.

## డయాలసిస్ ఏర్పాటుపై నిర్లక్ష్యం

**-భవనం పూర్తయినా అందుబాటులోకి రాని పరికరాలు**

**-ఇబ్బంది పడుతున్న డయాలసిస్ రోగులు**

**చొరవచూపని ప్రజా ప్రతినిధులు - మాటలకే పరిమితమైన పరిస్థితి**

**-దూర ప్రాంతాలకు వెళ్ళలేక అవస్థలు**





భవనం పూర్తయినా అందుబాటులో రాని డయాలసిస్ కేంద్రం.

బద్వేలు, జూలై 25 ప్రభాతవార్త :

బద్వేలులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేయాలని గతంలో నిర్ణయించినప్పటికీ ప్రైవేట్ సంస్థ ముందుకొచ్చి వేగంగా భవనం పూర్తి చేసినప్పటికీ ఇంత వరకూ పరికరాలు అందుబాటులోకి రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో డయాలసిస్ రోగులు అధిక సంఖ్యలో ఉన్నా నిత్యం వేల రూపాయలు ఖర్చు చేసి దూర ప్రాంతాలకు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై ప్రజా ప్రతినిధులు ఈ మధ్య కాలంలో వారు మాట్లాడుతూ త్వరలో పరికరాలు కూడా అందుబాటులోకి వస్తాయని చెప్పి కూడా నెలలు దాటుతుంది. దీనిని బట్టి చూస్తుంటే కేవలం ప్రజా ప్రతినిధుల తీరు మాటలకే పరిమితమవుతున్నారు తప్ప వేగంగా ఈ ప్రాంత రోగులను దృష్టిలో ఉంచుకొని డయాలసిస కేంద్రాన్ని ప్రారంభించాలనే ఆలోచన చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కడప, నెల్లూరు, తిరుపతి ప్రాంతాలకు డయాలసిస్ రోగులు వెళ్ళి చికిత్సలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వారంలో ఒక్క డయాలసిస్ రోగి 2 నుండి 3 సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఒక పేదవాడు ఇలా దూర ప్రాంతాలకు వెళ్ళి డయాలసిస్ చేయించుకొని తిరిగి ఇంటికి వెళ్ళాలంటే డబ్బుతో పాటు ప్రయాసకు గురికావలసి వస్తుంది. డయాలసిస్ చేయించుకున్న రోగి వెంటనే ప్రయాణం చేయాలంటే చాలా కష్టతరం. డయాలసిస్ చేసే సమయంలో రక్తం అంతా శుద్ధి చేయడంతో మనిషి పూర్తిగా కృంగిపోతాడు. ఇటువంటి సమయంలో సొంత ప్రాంతమైన బద్వేలుకు గానీ, పోరుమామిళ్ళకు గానీ, చుట్టుపక్క ప్రాంతాలకు వెళ్ళాలంటే వారి పరిస్థితి దయనీయం. ఇదిలా ఉంటే డయాలసిస్ రోగి దూర ప్రాంతాలకు చికిత్స కోసం వెళ్ళాలంటే తెల్లవారుజామున వెళ్ళాల్సిన దుస్థితి. ఇన్ని అవస్థలు రోగులు పడుతుంటే భవనం పూర్తయి నెలలు గడుస్తున్నా ఇంత వరకూ పరికరాలు రాక అవస్థలు పడుతున్నారు. డయాలసిస్ రోగుల పరిస్థితి వర్ణనాతీతంగా మారిందని, బద్వేలులో అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో ఉన్న రోగులకు చాలా సులభతరంగా ఉండడమే కాకుండా వారి ఆరోగ్యం కొద్దిగా అయినా మెరుగుపడే అవకాశం ఉంటుంది. బద్వేలులో అందుబాటులోకి వస్తే ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకొని వెంటనే వారి ఇళ్ళకు చేరుకునే అవకాశం ఉంటుంది. అలా కాకుండా దూర ప్రాంతాలకు వెళ్ళి చేయించుకొని రావాలంటే సాధ్యమయ్యే పని కాదని రోగులు పడే కష్టాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు గుర్తించడం లేదని డయాలసిస్ రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వారానికి రెండు సార్లు కడపకు వెళ్ళాల్సిన పరిస్థితి :**



కిడ్నీలు దెబ్బతిన్నాక చికిత్స చేయించుకున్న అనంతరం డయాలసిస్ చేయించుకునేందుకు వారానికి రెండు సార్లు కడపకు వెళ్ళి రావాలంటే చాలా ఇబ్బందిగా మారిందని డయాలసిస్ రోగి కంభంపాటి నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. బద్వేలు పట్టణం శివా నగర్‌కు చెందిన నరసింహులు గత కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. నెలకు రూ.15 వేల నుండి రూ.20 వేలు వరకూ ఖర్చవుతుందని, కడపలో ఉచితంగా చేసినప్పటికీ ఖర్చులతో పాటు చేయించుకున్న వెంటనే తిరిగి రావాలంటే ఆరోగ్యం సహకరించ దం లేదని, ఒక్కోసారి జ్వరం కూడా వస్తుందని, వెంటనే మళ్ళీ తిరిగి చికిత్స కోసం వెళ్ళాలంటే ఇబ్బంది మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బద్వేలులో అందుబాటులో ఉంటే డయాలసిస్ చేయించుకొని ఇంటికి వెళ్ళడమే కాకుండా అత్యవసరమైతే మళ్ళీ వచ్చి చికిత్స చేయించుకునే పరిస్థితి ఉంటుంది. **-కంభంపాటి నరసింహులు (డయాలసిస్ రోగి)**

## వర్షాకాలంలో వ్యాధులు ప్రజలకుండా చర్యలు తీసుకోవాలి

**జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి**



రాయచోటి, జూలై 25 ప్రభాతవార్త :

ప్రస్తుత వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజలు వ్యాధుల బారినపడ కుండా ముందస్తు జాగ్రతలు తీసుకొనవలసినదిగా జిల్లా పంచాయతీ అధికారిని ధనలక్ష్మి పలు ముఖ్యమైన సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ యందు బ్లీచింగ్, సున్నము తదితర వస్తువులు కొనుగోలుకై గ్రామ పంచాయతీ, సర్పంచ్ దృష్టికి తీసుకుని పోయి వెంటనే అవసరమున్న వస్తువులు గ్రామ పంచాయతీ ఏదైని నిధుల నుండి కొనుగోలు చేసి, గ్రామ పంచాయతీ యందు అంటు వ్యాధులు, ఏవిధమైన ఇతర వ్యాధులు ప్రబల కుండా వుండుటకు జిల్లా పంచాయతి అధికారి, జిల్లాలోని అందరు సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, విస్తరణ అధికారులకు, డివిజనల్ పంచాయతీ అధికారులకు సూచనలు జారీ చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో బోరు బావుల వద్ద నీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉండునట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురికి కాలువలలోని పూడిక తీసి మురికి నీరు నిలువ లేకుండా చూడాలని గ్రామముల యందు మురికి గుంతల్లో నీరు నిల్వలు లేకుండా చూడాలి. నిల్వ ఉన్న నీటి యందు దోమలు ప్రభలకుండా వేస్టు ఆయిల్ బాల్సులు వేయాన్నారు. ప్రతీ ఇంటి యజమానికి ఇంటి యందు కూలర్లలోని నీటిని నిల్వలేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతీ దినము త్రాగునీరును కాచి చల్లార్చి వడగట్టిన నీటిని త్రాగుటకు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. రాత్రి పూట దోమల బారిన పడకుండ నివారణకై దోమతెరలు వాడాలన్నారు. ఇండ్ల వద్ద ఎటువంటి అపరిశుభ్రత లేకుండా వుండుటకు, వ్యర్థ పదార్థాలు ఇంట్లో ఎక్కువ రోజులు నిలువ లేకుండా, ఇంటి వద్ద గల కాలువలు యందు చెత్త చెదారము, ప్లాస్టిక్ పేపర్ల వంటి వాటిని మురికి కాలువలో వేయకుండా చూడాలన్నారు. మీ గ్రామాల పరిధిలోని జాతీయ రహదారులు ముఖ్యమైన రహదారుల వెంబడి వున్న చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని ధనలక్ష్మి ఆదేశించారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే సీఎం లక్ష్యం

**ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి**



బాలంవారిపల్లె పంచాయతీలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పీలేరు, జూలై 25 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డి న్నారు. మంగళవారం ఎమ్మెల్యే పీలేరు మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ మొరవ హరిజనవాడ, తూగుంటపల్లె హరిజనవాడ, తూగుంటపల్లె, బాలంవారిపల్లె, జరిగిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. అలాగే దేశంలో ఏ రాష్ట్రం చేయని అభివృద్ధిని మన రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాధిస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులు గురించి వారికి వివరించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాథరెడ్డి, జడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు బీడి.నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ ఎన్‌వి.చలపతి, కంభం భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ దామోదర్ నాయకులు హుమయూన్, మహేశ్వరరెడ్డి, భాస్కరరెడ్డి, రమణారెడ్డి, స్వరూప్‌రెడ్డి, చిన్న యల్లప్ప, రమేష్‌రెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలతో పాటు మండల స్థాయి నాయకులు కార్యకర్తలతో పాటు మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ దేవుని చల్లని దీవెనలు ఉండాలి : ఎంపీపీ

వీరబల్లి జులై 25, ప్రభాతవార్త



ప్రజలందరికీ ఆ దేవుని దీవెనలు ఉండాలని మండల ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు మంగళ వారం ఆయన మండల కేంద్రంలోని వీరబల్లి పీర్ల చవిడికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన పీర్ల పండుగకు రూ.30వేలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంతో ఘనంగా జరిగే పీర్ల పండుగకు ఎంపీ పెద్దిరెడ్డి.మిథున్ రెడ్డి సౌజన్యంతో తాను రూ. 30,000 రూపాయలు ఉత్సవ కమిటీకి అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఆ చల్లని దేవుని ఆశీస్సులు పొందాలని తెలి పారు. కార్యక్రమంలో వీరబల్లి పీర్ల పండగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



కమలాపురం, జులై 25, ప్రభాతవార్త:

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోగటం మరియు గంగవరం పంచాయతీ సచివాలయంలో 11 రకాల సర్టిఫికెట్లు వార్డు సచివాలయా లలో ఎలాంటి రుసుము లేకుండా ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సి.కె.దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, కోగటం, మాజీ సర్పంచ్, కరుణ్‌రెడ్డి, గంగవరం సర్పంచ్, నాగేంద్రరెడ్డిలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కోగటంలో భారీగా పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల బంద్ విజయవంతం




లక్కిరెడ్డిపల్లె, జులై 25, ప్రభాతవార్త:

విద్యారంగ సమస్యలపై మంగళవా రం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు సీపీఐ రాయచూర్ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగల శ్రీనివాసులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటోందని గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు సున్నం కొట్టి బిల్లులు మార్చుకుంటోందన్నారు. అమ్మఒడి, వసతి దీవెన, విద్యా దీవెన పేరుతో విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచకుండా పాత విధానం లోనే హాస్టల్ విద్యార్థులకు మెనూ అందిస్తున్నారని మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ ఆస్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టా లని వారు కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం యథావిధిగా కొనసాగి అలాగే డిగ్రీ పాత విధానాన్ని కొనసాగించాలని జీవో నెంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రజియా, వెంకటేష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించాలి



వేంపల్లె, జూలై 25, ప్రభాతవార్త ః

ప్రతి ఉపాధ్యాయుడు తమ తరగతిగదిలోని విద్యా ర్థుల సామర్థ్యాన్ని గుర్తించాలని జడ్పీ ఉర్దూ పాఠశాల కాంప్లెక్స్ ఇన్‌ఛార్జి సెక్రెటరీ ఎస్ఎండి వలివుల్ ఖయ్యూ మ్, ఆర్పీ ఫైజ్ పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక జడ్పీ ఉర్దూ పాఠశాల నందు పులివెందుల నియోజకవర్గస్థాయిలోని ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండురోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశం నందు ఎన్‌రోల్ మెంట్ శాతాన్ని పెంచడం, జేవీకే కిట్లు, పాఠ్యపుస్తకాలు, తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఐఎఫ్‌బి సిస్టమ్ కింద ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐఎఫ్‌బి ద్వారా ఎస్ఈఆర్టీ ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు టెలికాన్ఫ రెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ప్రతి విద్యార్థి బడి మానకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు తరగతి గదిలో మంచి వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సూర్యకుమారి, డివిజన్‌స్థాయి ఉపాధ్యాయులు వనిపెంట షకీల, ఫిర్దోష్, గౌషియాబేగం, నాసియా, ఫాహిమా, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామి పనులు సక్రమం ః పిడి మద్దిలేటి




రైల్వేకోడూరు రూరల్, జులై 25 ప్రభాతవార్త

రైల్వేకోడూరు ఎంపిడిఓ కార్యా లయంలో మంగళవారం నిర్వహిం చిన ఉపాధిహామి సామాజిక తనిఖీ లో సక్రమంగా పనులు జరుగు తున్నాయని, అందులో ఎటువంటి అక్రమాలకు చోటులేకుండా ఎపిఓ కె.ఉమామహేశ్వర్‌రావు పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేర ప్రతి కూలీకి పనిని కలి ్పస్తున్నామని అన్నారు. మండలంలో 21 పంచాయతిల్లో నిక్కచ్చిగా ఉపాధిహామి పనులు జరుగు తున్నాయని జిల్లా పిడి మద్దిలేటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎంపిడి ఎ.జాషువా, ఎపిఓ ఉమా, కోడూరుకు చెందిన ఉపాధిహామి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## దుస్తుల దుకాణంలో షార్ట్ సర్క్యూట్

### రూ. 2లక్షల ఆస్తినష్టం

మదనపల్లెక్రైం, జూలై 25 ప్రభాతవార్త :



పట్టణంలోని ఆర్ఆర్ వీధిలో వున్న ఓ దుస్తుల దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో సుమూరు రూ.2లక్షల ఆస్థి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. పట్టణంకు చెందిన మెహీద్దీన్ ఆర్ఆర్ వీధిలో కట్‌పీస్ సెంటర్‌ను నిర్వహిస్తు న్నాడు. సోమవారం రాత్రి దుకాణం లకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం తెల్లవారిఝామున దుకాణంలో నుంచి పెద్దఎత్తున పొగలు రావటం గమనించిన స్థానికులు అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక అధికారి శివప్ప అధ్వ ర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలో వున్న బట్టలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.2లక్షలకు పైగా ఆస్థినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం




మదనపల్లెక్రైం, జూలై 25 ప్రభాతవార్త :

విద్యారంగ సమస్యలపై టిఎన్ ఎస్ఎఫ్, ఎఐఎస్ఎఫ్ సంయుక్తంగా పిలుపు నిచ్చిన విద్యాసంస్థల బంద్ విజయ వంతం అయినట్లు టిఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్, ఎఐ ఎస్ఎస్ నియోజకవర్గ కార్యదర్శి మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థలు ఇచ్చిన బంద్‌ను అడ్డుకోవ టానికి పోలీసులు యత్నించిన బంద్ విజయవంతం అయిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన విద్యావ్యవస్థ అస్థవస్థ్యంగా తయారైం దన్నారు. ఫీజురియంబర్స్ మెంట్, వసతిదీవెన, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలు కూడా అర్హులకు రాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో వినయ్, సంతోష్, కమలాకర్, సురేష్, వెంకటేష్, నితిన్, శ్రీనాథ్, ప్రశాంత్, పవన్, వెంకటేష్, రాజేష్ గణేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పాల ఏకరుల పోరుబాట భవిష్యత్తుకు గ్యారంటీ



పీలేరు, జూలై 25 ప్రభాతవార్తః

నియోజకవర్గంలోని జాండ్ల గ్రామం ఆవులయ్యగారిపల్లెలో తెదేపా బీసీ సాధి కార సమితి పాల ఏకరి కమిటీ సభ్యులు జ్యోతి భాస్కర్‌నాయుడు ఆధ్వ ర్యంలో మంగళవారం తెదేపా బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్ నాయు డు ముఖ్య అతిథిగా పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవు లయ్య గారిపల్లె యూత్ నిర్వహించిన పాల ఏకరుల బీసీల పోరుబాట తెదేపా బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర గారి ఆదేశానుసారం మాట్లాడుతూ బీసీల అభివద్ధి ఒక్క తెదేపాతోనే సాధ్యమవుతుందన్నారు. బీసీల అభివద్ధి కోసం గతంలో తెదేపా పలు పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈపథకాలన్నీ బీసీలకు దక్కేలా అన్ని చర్యలు తీసుకున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం బీసీల సంక్షేమానికి తగు చర్యలు తీసుకోలేదన్నారు. ఉన్న అరాకొర పథకాలు కూడా వైసీపీ నాయకులే అనుభవిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలపై కపట ప్రేమ చూపిస్తుందన్నారు. నిధులు లేని కార్పోరేషన్లను ఏర్పాటుచేసి బీసీ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇల్లు ఇల్లు తిరుగుతూ మన పాల ఏకరి కులస్తులందరూ బీసీలు అందరూ ఎన్నికలలో తెదేపాని కిశోర్‌కుమార్‌రెడ్డి గారిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. పాల ఏకరుల అభివద్దికి తెదేపా చిత్తశుద్దితో ఉందన్నారు. పాల ఏకరుల రాజకీయ అభివద్దికి తెదేపా తగు ప్రాధా న్యత ఇచ్చిందన్నారు. ఈ విషయాన్ని పాల ఏకరి కులస్తులు గుర్తించుకోవాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు కన్వీనర్ పులసర శివప్ప నాయుడు, మల్లూరు దేవి, జీవన్‌కుమార్‌నాయుడు, వేణుగోపాల్ నాయుడు, నారాయణస్వామినాయుడు, శ్రీనివాసులునాయుడు, రఘుపతి నాయుడు, భాస్కర్ నాయుడు, జీవినాయుడు, విశ్వనాధనాయుడు, కిరణ్‌కుమార్‌నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రమేష్‌నాయుడు, సుదర్శననాయుడు, అమర్నాధ నాయుడు, రాజశేఖర్‌నాయుడు, రామకష్ణనాయుడు, జాండ్ల ఆవులయ్యగారిపల్లె యూత్ వెంకటరమణనాయుడు, కొండమనాయుడు, మదనమోహన్‌నాయుడు, శివ రాజా, గంగాధరనాయుడు, హరీష్‌నాయుడు, మణికుమార్‌నాయుడు, నరసిం హులు నాయుడు, రాజేంద్రనాయుడు, రామయ్యనాయుడు, రాజేష్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

## వారపు సంతలో గేటు చెల్లించాల్సిన అవసరం లేదు



పీలేరు, జూలై 25 ప్రభాతవార్తః

పీలేరు పట్టణంలో ప్రతి మంగళవారం జరుగు వారపుసంతకు వ్యాపా ్స్తులు, రైతులు ఎలాంటి గేటురుసుము చెల్లించాల్సిన అవసరం లేదని సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం పీలేరు వారపుసంతను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఏడాదిపాటు వారి సొంత నిధులు వెచ్చించి పంచాయతీకి చెల్లించారని ఎవరు కూడా ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ పంచాయతీ వారు ఇచ్చిన గుర్తింపు కార్డులను వ్యాపారస్తులు తప్పనిసరిగా వాడుకోవాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి గేటు ఇవ్వాలని అడిగితే గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వార్డు మెంబరు సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేపీ ఉల్లిపై సదస్సు

దువ్వూరు, జులై 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామ రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో కేపీ ఉల్లి పంటపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. జాతీయ ఉద్యానవన పరిశోధన అభివృద్ధి సంస్థ రాష్ట్ర ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో బుధవారం 10 గంటలకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కేపీ ఉల్లిలో వచ్చే తెగుళ్లు, వివిధ రకాల సమస్యలు, ఉల్లి విత్తనాల ధర, మార్కెటింగ్ తదితర విషయాలపై ఉద్యానవన శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని కేపీ ఉల్లి రైతులు వినియోగించుకోవాలన్నారు.

## విద్యార్థుల ద్రోహి సిఎం జగన్

### టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్




నందలూరు, జులై 25 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ద్రోహి అని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ రేవూరి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌లో భాగంగా నందలూరు మండలంలో విద్యాసంస్థలు బంద్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు తాండవిస్తు పాలక ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలి, మెస్, కాస్మోడి ఛార్జిలు ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. అమ్మఒడి పథకం గత నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి బటన్ నొక్కినా కూడా ఇంతవరకు చాలామంది తల్లుల అకౌంట్లలో డబ్బులు పడని పరిస్థితి ఉందన్నారు. ప్రాథమిక విద్యను విలీనం చేసే జిఓ 84, 85 రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థలో ఫీజు రీయం బర్స్ మెంట్ అందించాలని, 77 జిఓ రద్దు చేయాలని అన్నారు. అమ్మఒడి, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, జగనన్న కానుక అనే పథకాలు పెట్టి విద్యార్థు లను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకుంటే ప్రభు త్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్య క్రమం లో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్, భాను, అజయ్, విజయ్ పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న బి.వి. రత్నం

రాయచోటి జులై 25, ప్రభాతవార్త



రాయచోటి పట్టణం ఆర్డిబిఎం ఎస్ సంస్థ నిర్వహిస్తున్న బివి రత్నం నాబార్డ్ ద్వారా ఉత్తమ అవార్డు అందుకున్నారు. విజయవాడ లెమన్ ట్రీ హోటల్లో మంగళవారం జరిగిన నాబార్డ్ 42వ సమావేశంలో నా వార్డు ప్రతినిధులు బివి రత్నం సేవలను కొనియాడుతూ ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసి ప్రశంసా పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో నాబార్డ్ అవార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం



పీలేరు, జూలై 25 ప్రభాతవార్తః

రాష్ట్రంలో విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వత్తి విద్యలతో సహా ప్రైమరీ విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ రంగంలోనే నాణ్యమైన విద్య అందించాలని ప్రయివేటు, ఎయిడెడ్, ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నిర్వహించిన ప్రయివేటు, కార్పోరేట్, ప్రభుత్వ విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని టీఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎస్‌ఏ నేతలు పాఠశాలల వద్ద దర్నా నిర్వహించి సమస్యల పరిష్కారం చూపాలని కోరారు.

## పేదలకు చీరలు పంపిణీ

రైల్వేకోడూరు రూరల్, జులై 25 ప్రభాతవార్త

రైల్వేకోడూరు ఉపసర్పంచ్ తోట శివసాయి జన్మదినం సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర, అంజిరెడ్డితో పాటు వైసిపి సర్పంచ్‌లు ఘనంగా ఉపసర్పంచ్ తోట శివసాయి జన్మదినాన్ని పురస్కరించుకొని నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్యంగా కోడూరు పంచాయతిలో అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నారని అన్నారు. ప్రజాసేవ అంటే సాయి పేరుకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో భుజంగేశ్వరదేవాలయ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడు, యోగానంద్, సర్పంచ్‌లు దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, చియ్యవరం సర్పంచ్ విష్ణు, నాయిని హరిక్రిష్ణారెడ్డి, గోపి, దార్ల చంద్రశేఖర్, కొప్పల శంకరయ్య, వైఎస్ కరిముల్లా, రవూఫ్‌తో పాటు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్ష కోసమే జగనన్న సురక్ష



పెండ్లిమర్రి, జులై 25, ప్రభాతవార్త:

జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజల రక్ష కోసమే అని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం ఆయన పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు సచివాలయం పరిధిలో 11 రకాల సర్టిఫికెట్లను గ్రామ వార్డు సచివా లయాలలో ఎలాంటి రుసుము వసూలు చేయకుండా అందజేయడం జరుగుతోం దన్నారు. సీఎం జగన్ ప్రజల కష్టాలను గుర్తించి ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఇంటి వద్దకే తెచ్చివ్వడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ బాలయ్య, సొసైటీ ఛైర్మన్ నాగేంద్రరెడ్డి, స్థానిక సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. అలాగే తుమ్మలూరు గ్రామ పంచాయతీలో కూడా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, చంద్రశేఖర్, పంచాయతీ సర్పంచ్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మొహరం పండుగకు రూ.40వేలు వితరణ

వీరబల్లి జులై 25, ప్రభాతవార్త



మండలంలోని ఈడీగ పల్లెలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే మొహరం పండుగకు మండల ఎంపీపీ గాలివీటి. రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం రూ.40 వేలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంతో ఘనంగా జరిగే మొహరం వేడుకలకు గాను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సౌజన్యంతో తాను ఈడీగ పల్లె మొహరం పండుగకు రూ.40 వేల రూపాయల ఇచ్చినట్లు తెలిపారు ఈ సందర్భంగా మండలంలోని ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడిగ పల్లె మొహరం కమిటీ పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

### జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్

వీరబల్లి, జూలై 25 ప్రభాతవార్త :



రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న విద్యా రంగ సమస్యల పరిష్కారానికై మంగ ళవారం వీరబల్లి మండలంలో నిర్వ హించిన బంద్ విజయవంతమైందని ఏఐఎస్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ పేర్కొన్నారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాక ము నుపు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి ఇప్పుడు పూర్తిగా విద్యారంగాన్ని నాశ నం చేసే విధంగా అడుగులు వేస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఎత్తివేసి ఇంటర్ విద్యార్థుల కడుపు కొట్టడం జరిగిందని, అంతేకాకుండా విద్యార్థులు తక్కువ ఉన్నారనే సాకు చూపించి ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లను ఎత్తివే యడం జరిగిందని, జీవో నెంబర్ 77 తీసుకొని వచ్చి పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు రాకుండా చేశాడని, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్నటు వంటి బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయలేదని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇంతవరకు పంపిణీ చేయలేదని, హాస్టల్లో మౌలిక వసతులు కల్పించలే దని, విద్యార్థులకు పెండింగ్లో ఉన్నటువంటి ఐదు నెలల బిల్లులను విడుదల చేయలేదని, వసతి గృహాలలో ఖాళీగా ఉన్నటువంటి వార్డెన్, వాచ్మెన్, కుక్, కమాటి పోస్టులను భర్తీ చేయలేదని, నాలుగు సంవత్సరాల డిగ్రీని రద్దుచేసి మూడు సంవ త్సరాల డిగ్రీనే కొనసాగించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, ఏకోపాధ్యాయ పాఠశాలలలో అదనపు టీచర్లను నియమించాలని, ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ వీరబల్లి మండలంలో ఉన్న పాఠశాలలు, కళాశాల ను మూపించి పరోక్షంగా విద్యార్థులను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు లను చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ పరిష్కారం చూపెట్టాలని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎ మండల నాయకులు వినయ్ కుమార్ సుమంత్, టిఎన్ఎస్ఎఫ్ మండల నాయకులు పవన్ కుమార్, మహేష్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సామరస్యంగా మొహరం పండుగ జరుపుకోవాలి : ఎస్.ఐ.

వీరబల్లి, జూలై 25 ప్రభాతవార్త :



మండలంలో హిందువులు, ము స్లింలు కలిసి జరుపుకుంటున్న మొ హరం పండుగను సామరస్యంగా జరుపుకోవాలని యస్.ఐ. చంద్ర మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మొహరం పండుగ కమిటీ సభ్యులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో జరుపుకుంటున్న మొహరం పండుగను సోదరబావంతో సామరస్యం గా జరుపు కోవాలని ఆయన సూచించారు. ఇందులో అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా గురు వారం ఈడిగ పల్లెలో జరిగే గుండం కార్యక్రమంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారుల సూచనలమెరకు కమిటీ సభ్యులు కార్య క్రమాన్ని నిర్వహించాలన్నారు. అదేవిధంగా శుక్రవారం రాత్రి జరిగే వీరబల్లి గుం డంలో కూడా అధికారుల సూచనలు పాటించి నిర్వహించాలన్నారు. ఆఖరి రోజైన శనివారం పీర్లు ఏటికి వెళ్ళేటప్పుడు ఎటువంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా నిర్వహించాలన్నారు. ఇందులో ఏమైనా పొరపాట్లు జరిగితే పీర్లపండు గ నిర్వాహ కులదే పూర్తి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి లీలా విలాసంపై ప్రవచనాలు

చాపాడు, జూలై 25 ప్రభాతవార్త :



అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం నందు మంగళవారంహిందూ ధార్మిక సంస్థ వ్యవస్థాపకులు, నైమిశారణ్య పీఠాధిపతి పరమ పూజ శ్రీ బ్రహ్మానంద సరస్వతిస్వాములవారు వీరభద్ర స్వామి లీలా విలాసం పైప్రవచనాల ద్వారా భక్తులకు హితబోధ చేశారు. ముందుగా ఆలయ సిబ్బంది అర్చకులు మంగళ వాయిద్యాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో అర్చకులు . వేద పండితులు నరేంద్ర శర్మ . అర్చకులు చిన్నా స్వామి , ఆలయ సిబ్బంది శ్వేత. భక్తులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు రికార్డులు, లైసెన్సులు కలిగి ఉండాలి : ఎస్.ఐ.

వీరబల్లి, జూలై 25 ప్రభాతవార్త :



ఆటో నడిపే డ్రైవర్లు లైసెన్స్ లు, ఆటోలకు రికార్డులు లేకపోతే కఠి నమైన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మంగళవారం ఆటో డ్రైవర్లుకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ ఆటో డ్రైవర్లు లైసెన్స్‌తో పాటు అటోలకు ప్రభుత్వ చూచనల మేరకు ఇ న్సూరెన్స్, యాఫ్ సి, అర్.సి, పొల్యూషన్ రికార్డులు కలిగి ఉండాలన్నారు. అలా లేని ఆటో డ్రైవర్లు ఆటోలను నడిపినట్లయితే వారిని పట్టుకొని పరిశీలించి వారిపై జరి మానాలు విధించి, కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా అతి వేగముతో పాటు ఎక్కువగా ప్రయాణికులను ఎక్కించుకుని నడిపినట్లైతే కఠినమైన చర్య లు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతియుతంగా పాఠశాలల బంద్ విజయవంతం

రామసముద్రం, జూలై 25 ప్రభాతవార్త :



మండలంలోని అన్ని పాఠ శాలల్లో సమస్యలు పరిష్కరిం చాలని ఏఐఎస్ఎఫ్ సహాయక కార్యదర్శి సూరి బంద్ పిలుపు మేరకు రామసముద్రం మండలంలో బంద్ విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో జరుగుతున్న ఫిజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర పోస్టుల ను మెగా డిఎస్సీ ద్వారా భర్తీచేయాలని బంద్ నిర్వహించడం జరిగింది. అను మతులు లేకుండా నడుపుతున్న పాఠశాలలు రద్దు చేయాలని డిమాండ్ చేశా రు. ఫిజుల నియంత్రణ కొరకు జిల్లా కలెక్టర్‌తో ఫిజునియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి వసతి గృహాలకు వార్డెన్‌లను నియమించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు కాస్మోటిక్ ఛార్జిలను విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిఇఓ లకు శాశ్వత హోదా కల్పించాలన్నారు. నాడు నేడు పనులలో జరుగుతున్నా అవి నీతిని అరికట్టాలన్నారు. లేని పక్షంలో భారీ ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చెపడాతమని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో అనిల్, సందీప్, రాజేష్, నాగేష్, చరణ్, చందు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు3న కలిచెర్లలో ఉచితమెగా మెడికల్‌క్యాంప్

పెద్దమండ్యం జూలై 25 ప్రభాతవార్త

మౌలాకా పహాడ్ వెల్‌ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆగస్టు3న కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద ఉచిత మెగా వైద్యశిబిరం నర్వహిస్తున్నట్లు వెల్‌ఫేర్‌సొసైటీ అధ్యక్షులు హాజరత్ సయ్యద్‌షా ఆరిపుల్లాహుస్సేని తెలిపారు. క్యాన్సర్, గుండెవ్యాధి, షుగర్, ఎమకలు, కీళ్ళువ్యాదులు, జనరల్, చిన్నపిల్లలు, స్త్రీ సంబంధిత వ్యాదులకు, హైదరాబాద్ బెంగళూరు వైద్యనిపుణులు పాల్గొంటా రన్నారు. ఉదయం 8నుండి సాయంత్రం 4 వరకూ చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని వక్ఫ్‌బోర్డుచేర్మెన్ కరీముల్లా తెలిపారు. ఈ కార్యక్రమానికి మం డలంలోని అందరు అధికారులు, ప్రజాప్రతినిధు లు హాజరుకావాలని కోరారు. ఉచితంగా రాకపోకలకు బస్సులు, ఆటోలుఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పూర్ణచంద్రికా రమేష్, వైస్‌ఛేర్మెన్ రషీదా, ఎంపిడివో శ్రీధర్ సర్పంచ్‌లు విశ్వనాధ, కంటి విశ్వనాధరెడ్డి, బాషా ఎంపిటీసీ లు గుర్రం చంద్ర, జయరాం, కోఆప్షన్ ఖాదర్‌వల్లి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మహల్ సీహెచ్‌సీని తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్



కలికిరి, జులై 25, ప్రభాతవార్త:

మండలంలోని మహల్‌లో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్ తనిఖీ చేశారు. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేయడం అక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలపై వారు అసహనం వ్యక్తం చేయడం వైద్యాధికారులు విధుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడం పలు అంశాలను గుర్తించి త్వరలోనే డీసీహెచ్ఎస్ అధికారి పర్యవేక్షించే విధంగా ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని చెప్పారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలో కొందరు వైద్యాధికారులు డ్యూటీలకు సంబంధించి రిజిస్టర్లలో సంతకాలు చేయకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఈ విషయంపై మంగళవారం మహల్ సీహెచ్‌సీని డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఆసుపత్రి రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో 9 మంది వైద్యాధికారులు విధులు నిర్వహించాల్సి ఉండగా ముగ్గురు వైద్యులు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగతా ఆరు మంది వైద్యులలో ఒకరు సెలవు పెట్టగా మిగిలిన వారు విధులకు గైర్హాజరవుతున్నట్లు తనిఖీలో వెల్లడైనట్లు సమాచారం. డ్యూటీ రోస్టర్ ప్రకారం వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కానీ వైద్యాధికారులు డ్యూటీ రోస్టర్ ప్రకారం విధులు నిర్వహించడం లేదు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ వైద్యాధికారులు అధిక మొత్తంలో జీతాలు పొందుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం మంచిదికాదన్నారు. వైద్యాధికారులు డ్యూటీ రోస్టర్ ప్రకారం పగలు, రాత్రివేళల్లో కూడా కచ్చితంగా వవిధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ సూపరింటెండెంట్ భవానిశంకర్‌ను ఆదేశించారు. వైద్యాధికారులు విధులకు హాజరైతే రోగులకు వైద్యులపై నమ్మకం కలిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు చికిత్సల కోసం వస్తారన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వైద్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మళ్లీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తనిఖీ నిమిత్తం వస్తానని వైద్యాధికారుల్లో మార్పులు రాకపోతే వారిపై ప్రభుత్వానికి నివేదికలు అందించి చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించి పరికరాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## గ్రీన్ అబాసిడర్ కాదు.. పంచాయతీ సెక్రటరీ

పెండ్లిమర్రి, జులై 25, ప్రభాతవార్త:



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి నడిరోడ్డుపై కుక్క చనిపోవడంతో దాని కళేబరాన్ని పక్కకు జరుపుతున్నాడు. ఆయన గ్రీన్ అంబాసిడర్ అనుకుంటే పొరపడినట్లే. ఈయన ఇసుకపల్లె గ్రామ పంచాయతీ సెక్రటరీ షేక్ కరీముల్లా. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు అందక విధులకు హాజరు కాకపోవడంతో ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న షేక్ కరీ ముల్లా కుక్క కళేబరాన్ని పక్కకు తొలగించి వాహనదారులు, ప్రజల ఇబ్బందులు తొలగించడంతో పలువురు వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ ఎన్ఆర్టీఎస్ సహకారంతో స్వస్థలం చేరిన యువకుడి మృతదేహం

కడప కార్పొరేషన్, జులై 25, ప్రభాతవార్త:



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శ కత్వంలో ఎన్ఆర్టీఎస్ అనునిత్యం ప్రవా సాంధ్రుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తోందని ఎన్ఆర్టీఎస్ ఛైర్మన్ మేడపాటి వెంకట్ తెలిపారు. చిత్తూరు జిల్లాలోని కొత్తకోట మండల పరిధిలోని నామాలపల్లికి చెందిన జి.మునిరాజు(22) జీవనోపాధి కోసం యూఏఈ (దుబాయ్) కి 25 రోజుల క్రితమే వెళ్లారని ఏపీ ఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ బీహెచ్ పేర్కొన్నారు. కానీ ఈనెల 14వ తేదీన జి.మునిరాజు ఉరేసుకొని చనిపోయాడని వెల్లడించారు. మునిరాజు బంధువు ఈ విషయాన్ని కువైట్ వైకాపా కన్వీనర్ సయ్యద్ అక్రమ్‌కు వివరించారు. భౌతికకాయాన్ని ఇండియాకు తరలించేందుకు తగు సహాయం చేయాల్సిందిగా అభ్యర్థించారు. ఏపీ ఎన్ఆర్టీఎస్ ప్రొవిజనల్ కోఆర్డినేటర్ టి.మోహన్ రావుతో కలిసి భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి ఎంబసీ ద్వారా ఉచిత టికెట్ ఇవ్వడం జరిగిందన్నారు. అక్రమ్, మోహన్‌రావు మాట్లాడుతూ మునిరాజు అనుమానాస్పదంగా చనిపోవడం బాధాకరమన్నారు. 24న ఆదివా రం యూఏఈ నుంచి ఎయిర్ ఇండియా ద్వారా సోమవారం చెన్నైకి మృతదేహం చేరిందన్నారు. ఏపీ ఎన్ఆర్టీ ఎస్ ఉచిత అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, భారత ఎంబసీ అధికారులకు, ఎన్ఆర్టీఎస్ ఛైర్మన్ మేడపాటి వెంకట్, సీఈవో హేమలతరాణి, డైరెక్టర్ ఇలియాస్, అక్రమ్, మోహన్‌రావులకు మృతుడి సోదరుడు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

## గోడ గడియారాలు పంపిణీ



వీరబల్లి జులై 25, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రతి అంగడికి టిడిపి పార్లమెంటరీ అధ్యక్షుడు గంట నరహరి చిత్రపటంతో కూడిన గోడ గడియారాలు మంగళవారం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రతి షాపు తిరిగి గోడ గడియారాన్ని పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని అన్ని షాపుల యజమానులకు గంటా నరహరి చిత్రపటంతో కూడిన గోడ గడియారాన్ని ఇస్తున్నామని తెలిపారు.

## నూతన గోశాలను ప్రారంభం

కడప వైద్యవిభాగం, జులై 25, ప్రభాతవార్త:



కడప-చెన్నై రహదారి పెద్దపల్లి గ్రామ పంచాయతీ, కనుమలోపల్లి వద్ద వెలసిన శ్రీ ఉమాదేవి సహిత నీలకంఠేశ్వర ఆలయంలో గోమాతలకు నూతన గోశాలను రాష్ట్ర ఉపప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసీపీ మండల ఇన్‌ఛార్జి మేడా మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. పెద్దపల్లె, గ్రామ పంచాయతీ సర్పంచ్, ప్రతినిధి ప్రతాప్ నాయుడులు ఉపముఖ్యమంత్రిని, మధుసూన్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. గోమాతల గోశాల ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని ఇటువంటి మూగజీవాల గోమాతలకు రాజస్థాన్ సమాజ్ వారు ఏర్పాటుచేయడం గొప్ప కార్యక్రమని రాజస్తాన్ సమాజ్ సంస్థ కడప నగరంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ ఛైర్మన్ ఎ.రాజేశ్వరిరెడ్డి, సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్ నాయుడు, ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, జ్యోతి మునిరెడ్డి, ఆలయ ట్రస్ట్ అధినేత బాబురావుల సుబ్బారెడ్డి, కాడే రమణ, రామ్‌సింగ్, శంభు సింగ్, నరపత్‌సింగ్, సిద్దవటం పోలీసు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అసూయ స్వార్థంతోనే వరద ఆరోపణలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు జులై 25, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వైసీపీ బుత్వఆధ్వర్యంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని, కేంద్ర ప్రభుత్వం, స్థానిక సంస్థల నిధులతోనే అభివృద్ధి జరుగుతుందన్న వరద ఆరోపణలలో కేవలం తనపై అసూయ స్వార్థపూరిత ఆలోచనలేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్పర్సన్ ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్ల పాలనపై ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రజలకు జరిగిన మేలును ఆయన విశ్లేషణాత్మకంగా వివరించారు. జగన్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి జరగాలని కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు సొంత నిధులతో జరిగిన అభివృద్ధి కాదని వరద వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సుమారు 2వేల కోట్ల అభివృద్ధి పనులు 2 వేల కోట్ల సంక్షేమం కళ్ళ ఎదుట ప్రజలకు కనిపిస్తున్నా వరదకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో కామనూరు గ్రామానికి ఐదు కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని 8కోట్లు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాలలో జమ చేశామన్నారు. ప్రొద్దుటూరు రాజుపాలెం మండలాలలోని గ్రామాలను అనుసంధానిస్తూ తారు రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో 105 కోట్లతో అభివృద్ధి పనులు రాజుపాలెం మండల పరిధిలో 32 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. వైసిపి అధికారం చేపట్టిన వెంటనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుని నేడు ప్రొద్దుటూరు ప్రజలకు ప్రతిరోజు త్రాగునీటిని అందిస్తున్న ఘనత వైసీపీ దేనని తెలిపారు 53 కోట్లతో కూరగాయల మార్కెట్ నిర్మాణం 165 కోట్లతో వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మౌలిక వసతులు ఏర్పాటు 4.50 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం 53 కోట్లతో రామేశ్వరం హై లెవెల్ వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు నియోజకవర్గంలో నాడు నేడు మనబడి పథకం ద్వారా 109 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తిచేసి పాఠశాలల రూపురేఖలే మార్చామన్నారు. సంక్షేమ పథకాల ద్వారా నియో జకవర్గంలో డ్వాక్రా రుణమాఫీ 0 వడ్డీ అమ్మ ఒడి రైతు భరోసా పంట నష్టపరి హారం పింఛన్ 24 వేల నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ ప్రజలకు 1354 కోట్లు ఆర్థిక సహాయం. 1024 కోట్లు రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. గత 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసూయ స్వార్థపూరితమైన ఆలోచనలతో అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని వరదకు సూచించారు.

## పెండింగ్ అమ్మఒడి నిధులు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్, జులై 25, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా విద్యార్థుల చదువుల కోసం అమ్మఒడి పథకం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమఅవుతుందని ఈ విద్యా సంవత్సరం జమ కాకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి అమ్మఒడి డబ్బులు అర్హులైన అందరికీ వచ్చేటట్లు చూడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సునీల్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 28వ తేదీన బటన్ నొక్కి తరువాత కూడా నెల గడుస్తున్నా ఇంత వరకు తల్లుల ఖాతాలో జమ కాకపోవడంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి వారి ఖాతాలో జమ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకుడు స్వరూప్‌తేజ, పీడీఎస్‌యూ నగర నాయకుడు శ్రీనాథ్ పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, జులై 25, ప్రభాతవార్త:




రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) నాయకత్వం కడపలో విద్యా సంస్థలు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థలలో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కాలేజీల్లో ఇంత వరకు పూర్తిగా పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే జీవో నెంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజులు నియంత్రించాలని కోరారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా అనేక మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. అలాగే డిగ్రీ కాలేజీ విద్యార్థులపై భారం పడకుండా స్కాలర్‌షిప్ ఫీజు, రీఎంబర్స్‌మెంట్ రూ.20వేలు నేరుగా కాలేజీ యాజమాన్యం అకౌంట్‌లో జమ చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.2వేలు కాస్మొటిక్ ఛార్జీలు పెంచి 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు మనోహర్, ప్రవీణ్, సుకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

కలికిరి, జులై 25, ప్రభాతవార్త:



అనారోగ్యంతో పడిపోయిన ఓ వ్యక్తిని చూసి సకాలంలో స్పందించి ఆసుపత్రి కి తరలించి చికిత్సలు చేయించి మానవత్వం చాటుకున్న ఘటన కలికిరిలో చోటు చేసుకుంది. కలికిరి 4 రోడ్ల కూడలిలో కానిస్టేబుల్ ఎన్.లక్ష్మినారాయణ (పీసీ నెంబర్ 1716) విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మునిరత్నం అనే వ్యక్తి రోడ్డు దాటుతూ అనారోగ్యంతో నడిరోడ్డులో పడిపోయాడు. అతనికి బల మైన రక్తగాయాలయ్యాయి. విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వెంటనే స్పందించి కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. దీంతో మణిరత్నం ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సకాలంలో స్పందించి ఓ వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ సేవలపై స్థానికులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సైతం కానిస్టేబుల్‌ను అభినందించారు.

## చిన్నపాటి వర్షానికే కరెంట్ కట్

ఖాజీపేట జులై 25, ప్రభాతవార్త



మండలంలో పల్లె ప్రాంతాలు,పట్టణ ప్రాంతాలు అనే బేధం లేకుండా చిన్నపాటి వర్షానికే కరెంటు ఉండటం లేదు. సాధారణంగా జోరు వానకు హోరు గాలికో కరెంటు పోతుంటుంది కానీ ఖాజీపేటలో పరిస్థితి అలా లేదు. చిన్నపాటి గాలికి చిన్నపాటి వర్షానికి కరెంటు ఏమాత్రం నిలవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది వైఫల్యం కలగలిపి ప్రస్తుత పరిస్థితికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. స్థానికంగా నివాసం ఉండని సిబ్బంది వలన ఈ పరిస్థితి వస్తుంది లైన్మెన్ దగ్గర నుండి లైన్ ఇన్స్పెక్టర్ వరకు ఎవరు స్థానికంగా నివాసం ఉండటం లేదు. కరెంటు సరఫరా లో ఏదైనా అవంతరాలు ఏర్పడినచో ప్రైవేట్ సిబ్బంది పైన, జేఎల్ఎం గ్రేడ్ 2 సిబ్బంది పైన బాధ్యతలు వేసి తాము ప్రశాంతంగా ఇంటికే పరిమితమవుతున్నారు. మొన్న కురిసిన చిన్నపాటి వర్షానికి బీసీ కాలనీలో ఓ వీధిలో కేవలం ఫీజులు వేయడానికి సిబ్బంది సహకరించకపోవడంతో రాత్రంతా వీధివాసులు దోమలతో నిద్రలేమితో గడపాల్సి వచ్చింది. ఇక విద్యుత్ వైర్ల పైన ఉన్న చిన్నపాటి కొమ్మలను సైతం తొలగించలేని నిర్లక్ష్య స్థితి సిబ్బందిలో నెలకొని ఉంది. రానున్న వర్షాకాలానికైనా సిబ్బందిని సరైన మార్గంలో పెట్టి సరఫరాలో అవంతరాలు లేకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు

## ఓటర్ నమోదు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి

ఆర్‌డిఓ రంగస్వామి

రామాపురం జులై 25, ప్రభాతవార్త



ఓటర్ నమోదు ప్రక్రియ సక్రమ నిర్వహించాలని అన్నమయ్య జిల్లా ఆర్డిఓ రంగస్వామి అన్నారు. స్థానిక ఎంపీడీవో సభ భవనంలో మంగళవారం బిఎల్ఓ లకు అధికారులకు నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు జరుగుతున్న ఓటర్ జాబితా నమోద ప్రక్రియలో అర్హులైన 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులను అలాగే ఓటు నమోదు చేసుకొని వారిని కూడా ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు సక్రమంగా నిర్వహించాలని బి ఎల్ ఓ లకు ఆయన ఆదేశించారు. బిఎల్వోలు ఓటర్ నమోదు చేసేటప్పుడు వారి వద్ద ఆధారాలు చూసుకొని వాటిని తప్పు లేకుండా ఓటరుగా నమోదు చేయాలన్నారు. కొన్ని ఓట్ల కార్డులపై ఇంటి నెంబర్లు జీరోగా ఉన్నాయని వాటిని కూడా లాస్ట్ నెంబర్ వేసి డోర్ నెంబర్ కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి వెళితే సమాచారంతోపాటు అన్ని వివరాలను ఓటరు వద్దనే తెలుసుకోవచ్చని అన్నారు. ఓటర్ కార్డులో మృతి చెందిన ఓటర్. గ్రామము వదిలిపోయిన. ఇతర చోటుకు వెళ్లిన. విదేశాలకు వెళ్లిన. వివాహం జరిగి వేరే ఊర్లు కు వెళ్లిన ఉద్యోగరీత్యా బదిలీ అయిన వారి పేర్లు తొలగించాలని అన్నారు. ప్రతి బిఎల్ఓలు ఓటర్ వారి చిరునామాలు కచ్చితంగా నమోదు చేయాలని అన్నారు .గతంలో దొంగ ఓట్లు నమోదైన వారి జాబితాను అధికారికంగా గ్రామాల్లో విచారించి ఆ ఓటర్ లను తొలగించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అరవింద్ కిషోర్. ఆర్. ఐ. రవికుమార్. వీఆర్వోలు. బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వారి వివరాలను ఉపాధి కార్యాలయంలో అందజేయాలి : ఏపిఓ

రామాపురం జులై 25, ప్రభాతవార్త



2023ు 24 సంవత్సరానికి సంబం ధించి గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పండ్లు తోటలు రైతులు తమ బ్యాంకు సంబంధించిన వివరాలు లను బ్యాంక్ అకౌంటు. ఆధార్ కార్డు. పాన్ కార్డు. బుధవారం ఉపాదా మీ కార్యాలయం అందజేయాలని ఏపీవో సురేంద్రనాద రెడ్డి తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 -24 సంవత్సరం సంబంధించి ఉపాధి హామీ పథకంలో మండల వ్యాప్తంగా 66 మంది లబ్దిదారుల సంబంధించి 262 ఎకరాలు పండ్లు తోటలకు పెంపకానికి ఎంపిక అయిందన్నారు. త్వరగా లబ్దిదారుల సమా చారంను వెండర్ ఐడియా కింద నమోదు అయితే బ్యాంకు ఖాతాలో నగదు ను జమ చేయడం జరుగుతుందని అన్నారు. పండ్ల తోటలకు పెంపకానికి సంబంధించి మూడు సంవత్సరాలకు ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందన్నారు. ఎకరాకు మూడు సంవత్సరాలుగాను రూ లక్ష 5000 రూపాయలు చొప్పున జమ అవుతుందన్నారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా లబ్దిదారులు ఈ అవకాశాన్ని చదివినయం చేసుకోవాలన్నారు.

## మైనారిటీ నాయకునికి భారీ కాన్వాయ్‌తో స్వాగతం

గుర్రంకొండ, జులై 25, ప్రభాతవార్త



రాష్ట్ర మైనారిటీ సీనియర్ నాయ కులు హజ్‌యాత్ర ముగించుకొని తిరిగి రావడంతో స్థానిక నాయకులు మంగళ వారం భారీ కాన్వాయ్‌తో స్వాగతం పలికారు. రాయటోటికి రాగానే స్థానిక నాయకులు వాహనాలతో స్వాగతం పలికి గుర్రంకొండకు తీసుకొచ్చారు. గుర్రంకొండ సర్పంచ్ మెహర్‌తాజ్, మైనారిటీ నాయకులు డి. జమీర్‌అలీఖాన్‌లకు సచివాలయాల వాలంటీర్లు, సిబ్బంది బొకేల తో స్వాగతం పలికారు. పూలహారాలు, పూలు చల్లుతూ నాయకులు, కార్య కర్తలు తమ అభిమానాన్ని చాటుకొన్నారు. గ్రామంలోని ప్రజలందరూ బాగుం డాలని, గ్రామం మరింత అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరుకోసం మక్కాలో దువా చేయడం జరిగిందన్నారు. ఎంపిటిసి ఖధీర్, నాయకులు నాయని శివశంకర్, జమీర్‌ఖాన్, నూర్ ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికినవారిలో నాయ కులు యమ్. సైపుల్లా, కబీర్, అక్బర్, యాటల్‌బాబు, ఆరిఫ్‌భాష, బాబా, అల్తాప్, గౌస్‌మోదీన్, సుధాకర్, జయేంద్ర, సుధాకర్, వాలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

## పడకేసిన సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష

ప్రొద్దుటూరు మండల వైసిపి కన్వీనర్ మార్తల ఓబుల్‌రెడ్డి




ప్రొద్దుటూరు జులై 25, ప్రభాతవార్త

రాష్ట్రంలో కొన్నేళ్లుగా పరిష్కారం కానీ పడకేసిన సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రొద్దుటూ రు మండల వైసీపీ కన్వీనర్ మార్తల ఓబులరెడ్డి పేర్కొన్నారు మంగళవారం ప్రొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను లబ్దిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ దృతరణ పత్రాలు వల్ల మరి కొంతమంది రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు అర్హులైనందుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ నజీర్ అహ్మద్ వైసీపీ నాయకులు కార్యకర్తలు గృహసారథులు ప్రజలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై రేపు బహిరంగ సమావేశం

చాపాడు జులై 25, ప్రభాతవార్త

స్థానిక స్త్రీ శక్తి భవనం నందు రేపు ఉపాధి పనులపై బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ పద్మారాణి తెలిపారు. ఈ సందర్భంగా 2022 ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకుమండల వ్యాప్తంగా గ్రామాలలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ సిబ్బందిచే ఈనెల 12వ తేదీ నుండి24 వరకుఆయా గ్రామాల సచివాలయాలలోగ్రామ సభలు నిర్వహించారు. ఉపాధి పనులపై గురువారం బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## వీరభద్ర స్వామి లీలా విలాసంపై ప్రవచనాలు

చాపాడు జులై 25, ప్రభాతవార్త



అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంనందు మంగళవారం హిందూ ధార్మిక సంస్థ వ్యవస్థాపకులు, నైమిశారణ్య పీఠాధి పతి పరమ పూజ శ్రీ బ్రహ్మానంద సరస్వతిస్వాములవారు వీరభద్ర స్వామి లీలా విలాసం పైప్రవచనాల ద్వారా భక్తులకు హితబోధ చేశారు. ముందుగా ఆలయ సిబ్బంది అర్చకులు మంగళ వాయిద్యాలు పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అర్చకులు . వేద పండితులు నరేంద్ర శర్మ. అర్చకులు చిన్నాస్వామి , ఆలయ సిబ్బంది శ్వేత. భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి మండల పూజ



గాలివీడు జులై 25, ప్రభాతవార్త

మండలంలోని చీమల చెరు వు పల్లె పంచాయితీ కేంద్రంలో నెలకొల్ప బడిన శ్రీ వెంకటేశ్వర స్వామి మండల పూజ మంగళవారం అంగరంగ వైభవం గా నిర్వహించారు. వేద పండి తులు కుమారస్వామి బృందం ఆధ్వర్యంలో గత నెల 12, 13, 14, తేదీలలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనాటి నుంచి మంగళవారం వరకు స్వామివారికి 41 రోజులు పాటు ప్రతిరోజు పాలా భిషే కాన్ని నిర్వహించారు. స్వామివారికి వేద పండితులు అభిషేకంతో పాటు, పూర్ణ హ్రుతి హెూమం, అగ్నిగుండ హెూమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కుబళ్లను తీర్చుకున్నారు. వేద పండితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు, ఆశీర్వ చనాలు అందించారు. ఆలయ నిర్వహకులు భక్తాదులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయండి

గోశెట్టి వెంకటరమణయ్య




మైదుకూరు జులై 25, ప్రభాతవార్త

రాయలసీమ హక్కుల సాధనకై ఈనెల 28వ తేదీన ఢిల్లీలో జరుప తలపెట్టిన ధర్నా కార్యక్రమమును విజయవంతం చేయాలని మంగళవారం మైదుకూరు అంబేద్కర్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ బ్యానర్ గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం గోశెట్టి వెంకట రమణయ్య మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా రాయలసీమకు రావలసిన నిధులు నికరజలాలు లభ్యం కాలే దని, రాయలసీమ జిల్లాల అభివృద్ధి కోసం ఎలాంటి పరిశ్రమలు రాలేదని, కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందని, ప్రాజెక్టులు పూర్తి కాకపోగా వీటి అనుసంధాన కాలువలు ఏ ఒక్కటి పూర్తికాలేదని రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నారని రాష్ట్రాన్ని పాలించే నాయకత్వం రాయలసీమ నుండి ఉన్నా "అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్న" చందాన రాయలసీమ ఎడారిగా మారిందని అన్నారు. కావున రాయలసీమ హక్కుల సాధనకై రాయలసీమ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్కల శ్రీనివాసులరెడ్డి, కొండపేట నారాయణరెడ్డి, బంగారు కొండయ్య, పసుపుల శేషయ్య, గోశెట్టి రాఘవేంద్ర, గుర్రం పెద్ద నరసింహులు మరియు డి సుబ్రహ్మణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష విజయవంతం : ఎంపిడిఓ



రామసముద్రం జులై 25, ప్రభాతవార్త

రామసముద్రం మండలంలో జరి గిన జగనన్న సురక్ష కార్యక్రమం ఎమ్మెల్యే నవాజ్ బాష ఎంపి మిథున్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో విజయవంతం అయ్యిందని మండలఎంపిడిఓ నారాయణ స్వామి తెలిపారు, మండలంలో 18పంచాయతీ లుండగా ఎంపిడిఓ, డీటీ శ్రీనివాసులు ఒక టీమ్ తహసీల్దార్ దైవరాజన్, ఈవో ఆర్ డి షబ్బీనా ఒక టీమ్ గా ఏర్పడి జగన్ అన్న సురక్ష ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది అని అన్నారు, అన్ని పంచాయతీ ల్లోను ప్రజా ప్రతినిధులు,అధికారులఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అవసరమైన 11రకాల సర్టిఫికెట్లను అక్కడక్కడనే పంపిణీ చేశారు,4506సర్టిఫికెట్ ప్రజా ప్రతినిధులతో ఎంపిడిఓ, తహసీల్దార్, డీటీ లతో అందజేశారు, జగన్ అన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఎంపీపీ కుసుమకుమారి, జడ్పీటీసీ రామచంద్ర రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు కేశవ రెడ్డి, మండలకన్వీనర్ భాస్కర్ గౌడు, వైస్ ఎంపీపీ రమణ రెడ్డి సచివాలయకన్వీనర్ నందరెడ్డి, పంచాయతీ కార్యదర్శిలు, ఎక్కడా అవాంచన సంఘటనలు జరగకుండా ఎస్సై చంద్రశేఖర్ పోలీస్ సిబ్బంది బందోబస్త్ ఏర్పాటు చేశారు, జగన్ అన్న సురక్ష కార్యక్రమాన్ని విజవంతంగా, జరిగేందుకు సహకరించిన సర్పంచ్‌లకు ఎంపిటీసీ లకు, అన్ని శేఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, మీడియా మిత్రులకు మండలసమస్త ప్రజానీకానికి ధన్య వాదములు ఎంపిడిఓ కృతజ్ఞతలు తెలిపారు. నాకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే నవాజ్ బాషా, మంత్రి వర్యులు పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి అన్న ఎంపి మిథున్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదములు అని అన్నారు,

## చిత్రకళా శాఖను సందర్శించిన ప్రధానాచార్యులు



వైవీయూ జులై 25, ప్రభాతవార్త

చిత్రాలు మనిషికి ఆహ్లాదం వినూత్న ఆలోచనలకు మార్గలని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధానాచా ర్యులు ఎస్ రఘునాథ్ రెడ్డి అన్నారు. వైవీయూలోని ఆర్ట్స్ బ్లాక్ ను మంగళవారం మధ్యాహ్నం సందర్శించారు. అన్ని శాఖలలో కొనసాగుతున్న తరగతులను పరిశీలించారు. అనంతరం చిత్రకళ విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. వారు గీసిన చిత్రాలను పరిశీలించారు. ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డా. మృత్యుంజయరావు విద్యార్థుల ప్రగతిని వివరించారు.

## మణిపూర్ ఘటనపై పాత్రికేయుల ర్యాలీ

ప్రొద్దుటూరు జులై 25, ప్రభాతవార్త



మణిపూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనపై ప్రొద్దు టూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికే యులు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీరాము ల పేటలోని ప్రెస్ క్లబ్ నుండి పాత్రికేయులు క్యాండిల్స్ చేత పట్టి శివాలయం కూడలి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తల చేయాలని సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ప్రింట్ మరియుఎలక్ట్రానిక్ పాత్రికేయులు పాల్గొన్నారు.

## రెండోరోజు కౌన్సెలింగ్‌లో 426మందికి అడ్మిషన్లు



వేంపల్లె, జూలై 25, ప్రభాతవార్త ః

ఆర్జీయూకేటీ ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి చెందిన మొదటివిడత రెండోరోజు కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా 426మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు ఆర్.కె.వ్యాలీ క్యాంపస్ డైరెక్టరు సంధ్యారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రామ్‌భూపాల్‌రెడ్డి, ఎఫ్‌వో దినేష్‌రెడ్డి, ఓఎస్డీ వైఎస్ గంగిరెడ్డి, అకడమిక్ డీన్ సి.హెచ్.రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్, కీటకజనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

– జోనల్ మలేరియా అధికారి డా॥ పి.సరస్వతి

బద్వేలు అర్బన్, జూలై 25 ప్రభాతవార్త :



సీజనల్, కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా జోనల్ మలేరియా అధికారి డా॥ పి.సరస్వతి అన్నారు. మంగళవారం స్థానిక బద్వేలు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తొట్టిగారిపల్లె ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా వారు సందర్శించారు. అనంతరం డా॥ పి.సరస్వతి మాట్లాడుతూ సీజనల్, కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వ్యాధులకు ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ కిట్‌తో సకాలంలో పరీక్షలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వారు ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రిలో ల్యాబ్, మందుల గదిని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డా॥ జె.వినయ్ కుమార్, డా॥ పి.జ్యోత్స్న, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నిత్య పూజయ్య మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

– రూరల్ సిఐ లింగప్ప



చిన్నమండెం, జులై 25ప్రభాతవార్త:

మండల కేంద్రంలో ఈనెల 28, 29వ తేదీలలో హిందూ, ముస్లిం సోదరులు జరుపుకొనే మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని రాయచోటి రూరల్ ఇన్‌స్పెక్టర్ లింగప్ప, చిన్నమండెం ఇన్‌స్పెక్టర్ డి. రమేష్‌బాబులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం చిన్నమండెం పీర్ల మకాం దగ్గర హిందూ, ముస్లిం మతపెద్దలు, గ్రామస్తులను పిలిపించి మీటింగ్ ఏరా ్పటు చేసి మొహరం పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. పండుగ నిర్వహణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## రక్త హీనతకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు తీసుకోవాలి

రాయచోటి టౌన్, జులై 23ప్రభాతవార్త:



రాయచోటి మండలం శిబ్యాల పంచాయతీ పరిధిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు రక్తహీనత గుర్తింపు కోసం ఆరోగ్య సిబ్బంది పరీక్షలు, ఎత్తు, బరువు, హెచ్.బి. శాతం పరీక్షలు నిర్వహించారు. ప్రతియొక్క విద్యార్థి ప్రతి గురువారం ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. తీవ్రమైన రక్తహీనత ఉన్న పిల్లలకు వారానికి రెండు రోజులు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు మింగాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కోఆర్డినేటర్ యర్రపురెడ్డి, విశ ్వనాథరెడ్డి, , ఎంఎల్ హెచ్.పి.ఎ.శిరీషా, ఎ.ఎన్.ఎంలు వి. సరస్వతి, ఎం. అంజనమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వై.ఎస్.వివేకానంద రెడ్డి హత్య రాజకీయ హత్య కాదు

– ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి

పోరుమామిళ్ళ, జూలై 25 ప్రభాతవార్త :



వై.ఎస్.వివేకానంద రెడ్డి హత్య రాజకీయ హత్య కాదని ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ వివేకానంద రెడ్డి హత్య రాజకీయ హత్య కాదని, ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వివేకా హత్య కేసు కోర్టులో నిలబడదని అర్థం కావడంతో సీబిఐ కొత్త కథలు అల్లుతుందని ఆయన విమర్శించారు. ఇప్పటి వరకూ లభించిన ఆధారాలను సీబిఐ ఏమి చేసిందని ప్రశ్నించారు. ఆధారాలన్నీ ఒక వైపు ఉంటే ధర్యాప్తు మరో వైపు కొనసాగుతుందన్నారు. చంద్రబాబుకు అనుకూలంగా స్టేట్‌మెంట్‌లు మార్చుతున్నారన్నారు. వివేకా పేరు మీద మచ్చ పడకుండా ఎంపీ అవినాష్ రెడ్డి ఎంతో మౌనంగా అవమానాన్ని భరిస్తూ వస్తున్నారన్నారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకోవాలని వారు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో శాప్ కోచ్ మృతి

రాజంపేట అర్బన్, జులై 25 ప్రభాతవార్త



దురదృష్టకరం ఓ కోచ్‌ను వెంటాడింది. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు రోడ్డు ప్రమాదం వెంటాడి మృత్యు లోగిలికి చేర్చాయి. రాజంపేట ప్రభుత్వ క్రీడా మైదానంలో కాంట్రాక్టు ప్రాతిపధికన కోచ్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న హరికృష్ణంరాజు ఇటీవలే వైద్యం చేయించుకుని ఇంటికి వచ్చారు. మరలా ఆరోగ్య పరీక్షలు చేసుకునేందుకు తిరుపతికి వెళుతుండగా సోమవారం బోయనపల్లె వద్ద కారులో వెళుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో హరిక్రిష్ణంరాజుతో పాటు అతని తండ్రి, విశ్రాంత హెడ్‌కానిస్టేబుల్ నరసింహరాజు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హరికృష్ణంరాజు మంగళవారం మరణించినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రమాదంలో గాయపడిన విశ్రాంత హెడ్‌కానిస్టేబుల్ కోలుకుంటున్నట్లు తెలిసింది.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్

రైల్వేకోడూరు రూరల్, జులై 25 ప్రభాతవార్త




శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మంగళవారం స్కిల్‌డెవలప్‌మెంట్ జాబ్‌మేళా నిర్వహించిన కార్యక్రమంలో నిరుద్యోగులకు చక్కటి ఉపాధి అవకాశాలు నిర్వహిస్తున్నామని అన్నమయ్య జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ అన్నారు. ముఖ్యంగా శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని వారు అన్నారు. ఇందులో స్కిల్‌డెవలప్‌మెంట్ వారు రైల్వేకోడూరులో వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కలి ్పంచాలనే ఉద్ధేశ్యంతో కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 424 మంది హాజరు కాగా అందులో 176 మంది విద్యార్థిని విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న జాబ్‌మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ముఖ్యంగా ప్రతి నిరుద్యోగి ఉద్యోగి కావాలని ముఖ్యమంత్రి ఆశయమని అన్నారు. అదేకోవలో సాయి డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు చక్కటి ఉపాది లభించిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్‌డెవలప్‌మెంట్ నిర్వాహకులు హరిక్రిష్ణ పాల్గొన్నారు.

## విఆర్‌ఏ వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం

గాలివీడు, జూలై 25 ప్రభాతవార్త :



తన భూమిని అక్రమంగా విఆర్‌ఏ తన పేరు మీద ఆన్లైన్ చేసుకుని వేధింపులకు గురి చేస్తున్నారన్న కారణంతో చీకటి వెంకటలక్ష్మి(65) అనే మహిళ మనస్తాపంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది.కుటుంబ సభ్యుల కథనం మేరకు గాలివీడు మండలం గోరాన్ చెరువు గ్రామంలోని కరిమిరెడ్డి గారి పల్లెకు చెందిన చీకటి శ్రీరాములు భార్య చీకటి వెంకటలక్ష్మి అనుభవంలో వున్న 1.70 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన తన సమీప బంధువైన విఆర్‌ఏ ఆ భూమిని అక్రమంగా తన పేరుపై ఆన్లైన్ చేసుకుని వెంకటలక్ష్మిని వేధింపులకు గురిచేయడంతో మనస్తాపంతో పురుగుల మందు సేవించి బలవన్మరణానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.గత పక్షం రోజులుగా ఈ వ్యవహారం సాగుతుండగా విఆర్‌ఏ వేధింపులు తారాస్థాయికి చేరడంతో మంగళవారం ఉదయం వెంకటలక్ష్మి తన నివాసంలో పురుగుల మందు సేవించింది.వెంటనే 108 వాహనంలో వెంకటలక్ష్మిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు.సర్వే నంబర్ 867/8 లో 42 సెంట్లు, 868/1 లో 36 సెంట్లు(డికేటి) , 868/3 లో 76 సెంట్లు(డికేటి) భూమి గత ముప్పై సంవత్సరాలుగా వెంకటలక్ష్మి కుటింబీకుల అనుభవంలో ఉన్నప్పటికీ సదరు విఆర్‌ఏ వ్యవస్థలను తప్పుదోవ పట్టిస్తూ,రెవెన్యూ యంత్రాంగాన్ని తన గుప్పెట్లో వుంచుకుని బెదిరించడం వంటి చర్యలతో ఇంతటి దారుణానికి ఒడిగట్టారని బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇదే విషయమై పలుమార్లు స్థానిక మండల రెవెన్యూ అధికారులకు,జిల్లా కలెక్టర్ వారికి లిఖితపూర్వకంగా పిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కూడా అనేకమార్లు పలువురి గ్రామస్థుల భూములను కూడా అక్రమించినట్లుగా సదరు విఆర్‌ఏ పై ఆరోపణలు రావడం కొసమెరుపు.ఇదే విషయమై గాలివీడు పోలీసులను విచారించగా తమవద్దకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్పష్టం చేశారు.

## విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం




రాయచోటి జులై 25, ప్రభాతవార్త

విద్యారంగ సమస్యలు పరిష్కారానికై మంగళవారం రాయచోటి పట్టణం, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లె, సంబేపల్లె, చిన్నమండెం గాలివీడు మండలాల్లో నిర్వహించిన కే.జీ టు పి.జీ విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, ఏఐఎస్బి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేశా, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షుడు దేవేంద్ర , ఏపీ ఎస్ ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కిరణ్ , ఆర్ ఎస్ యు నాయకులు నాగేంద్ర, పిడిఎస్యు నాయకులు వంశీల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని వారు మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఉండేదని ,ఆ పథకం అనేకమంది పేద విద్యార్థులకు కడుపు నింపిందన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం ఆ పథకాన్ని ఎత్తివేసి కొన్ని వేల మంది విద్యార్థుల కడుపు కొట్టడం చాలా బాధాకరమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ ,ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల దగ్గర్నుండి పాఠశాల ఫీజు, పుస్తకాల ఫీజు ,బట్టల ఫీజు, దోబీ ఫీజు ,హాస్టల్ ఫీజు , వంటి ఇతర ఫీజులతో లక్షలాది రూపాయలను విద్యార్థి తల్లిదండ్రులు దగ్గర నుండి వసూలు చేస్తూ , వారి యొక్క రక్తాన్ని జలగల్లా పిలుస్తుంటే వారిపైన ఈ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి, యువజన, ప్రజా సంఘా ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన, ఆందోళన కార్యక్రమాలు నిర్వ హిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాయచోటి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు లోకేష్, ప్రశాంత్, నాయకులు వెంకట్ కుమార్, గిరిబాబు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు రాజు, నవీన్, విశాల్, అశోక్ ఏఐఎస్బి నాయకులు శ్రీనివాసులు సైఫ్ అలీ ఖాన్, ఏపిఎస్ఎఫ్ నాయకులు నారాయణ, రెడ్డి, ఆర్.ఎస్.యు నాయకులు నాగేంద్ర, శ్రీకాంత్, పి ఆర్ ఎస్ ఎఫ్ నాయకులు రఫీ, ఆసిఫ్ పాల్గొన్నారు.

## ముస్లింలు విద్యతో ఉన్నత స్థాయికి ఎదగాలి

– ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి



పోరుమామిళ్ళ రూరల్, జులై 25ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి నివాసంలో పోరుమామిళ్ళ పట్టణ ముస్లిం సోదరులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ముస్లిం సోదరులు మాట్లాడుతూ రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న ఈద్గాకు ప్రహరిగోడ, ముస్లిం సోదరులకు కమ్యూనిటి హాల్ గురించి అడగడం జరిగింది. ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదరులు పేదరికంతో ఎంతో వెనుకబడి ఉనా ్నరన్నారు. కావున విద్యతో మంచిగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అలాగే ఈద్గాకు సంబంధించి ప్రహరి గోడను వీలైనంత త్వరగా పనులు చేపట్టేదానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మాజీ మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, అంజిమన్ కమిటీ అధ్యక్షులు రాజీవ్ బాషా, అల్లా, పోరుమామిళ్ళ, రంగసముద్రం పంచాయతీ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఓటరు సమగ్ర సర్వేకు సహకరించండి

తహశీల్దార్ మహేశ్వర్‌రెడ్డి

వీరబల్లి, జూలై 25 ప్రభాతవార్త :



మండలంలోని సమగ్ర ఓటర్ సర్వే పై పలు రాజకీయ పార్టీ నాయకులతో వీరబల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా తాహసిల్దార్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బిఎల్వోలు ఇంటింటికి వచ్చి ఓట్లు వెరిఫికేషన్ చేసే సమయంలో రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. బిఎల్వో లు ఇంటింటికి వచ్చి పరిశీలన చేసే సమయంలో వాలంటీర్లకు అనుమతి లేదని తెలియజేశారు. వాలంటరీలు ఎవరైనా పాల్గొంటే వారి పైన ఫిర్యాదు చేయవచ్చునని తెలియజేశారు. ఎవరైనా అర్హత లేని ఓటర్లు ఉంటే తొలగించే అవకాశం ఉందని తెలియజేశారు. అలాగే 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు ఉండేటట్టు ఓటర్ జాబితాలో చేర్చుకోవాలని తెలియజేశారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు తాహసిల్దార్ అన్ని విధాల గ్రామాలలో బి ఎల్ వో లకు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు భాను గోపాల్ రాజు ,టిడిపి బిఎల్ఏలు నేతి రమేష్ బాబు, రామకృష్ణంరాజు, సుధాకర, నాగప్ప నాయుడు , శివ,పలు పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు పక్కదారిపట్టాయి

బిజెపి నాయకులు సాయిలోకేష్



నందలూరు, జులై 25 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం 2014 సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్రం విడిపోయిన పద్ధతి చట్టప్రకారం జరగలేదని, ఆంధ్ర రాష్ట్రానికి సరైన న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి మోడి రాష్ట్రానికి నిధులు మంజూరు చేయడం జరిగింది. అందులోను రాయలసీమ ప్రాంతంపై ఎంతో అభిమానంతో ఉమ్మడి కడపజిల్లాలోని నందలూరు మండలం శ్యామ్‌ప్రకాష్‌ముఖర్జి రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద 100 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని, వాటిని సరైన రీతిలో ఉపయోగించలేదు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఆదేశాల మేరకు బిజెపి రాష్ట్ర పార్లమెంట్ కన్వీనర్, సీనియర్ నాయకులు సాయిలోకేష్ మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ సౌభాగ్యంను ఈ విషయంపై పూర్తి వివరాలు కావాలని అడిగారు. ఈ విషయమై ఎంపిడిఓ వివరణ ఇస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి 30 కోట్లు మాత్రమే నిధులు వచ్చాయని, అందులో 13 కోట్లు పనులు పూర్తి చేశామని మిగిలిన మొత్తం తిరిగి వెళ్లిపోయిందని ఆమె తెలిపారు. అనంతరం బిజెపి మైనార్టీ నాయకులు షబ్బీర్‌అహ్మద్ మాట్లాడుతూ మండలానికి వచ్చిన నిధులు వాటిని ఎక్కడ ఉపయోగించారు? వాటి వివరాలు ఇవ్వాలని, అవసరమైతే కేంద్రం నుండి మండలానికి తీసుకొచ్చే విధంగా చూస్తామని అన్నారు. అలాగే పంచాయతిలో గల సచివాలయం ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ప్రభుత్వ నిర్ణయాలను మీరు తుంగలో తొక్కారని, వీటిపై మేము కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి పోరాటానికి ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలి

మదనపల్లి, జూలై 25 ప్రభాతవార్తః

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి

ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న ఆశా కార్యకర్తల సంక్షేమం గాలికి వదిలేశారని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా అధ్యక్షురాలు యం ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నో సంవత్సరాలుగా మెడికల్ రంగంలో కీలకమైన పాత్ర పోషించి గర్భవతులకు, బాలింతలకు పసి పిల్లలకు అనేస వైద్య సేవలు అందిస్తూ గొడ్డు చాకిరీ చేస్తున్నా ఆశా కార్యకర్తలకు ప్రభుత్వాలు ఇస్తున్న వాగ్దానాలు అమలు చేయడంలో వైఫల్యం చెందారని ఆరోపించారు.ఉదయం ,మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి,అని అన్ని వేళలా అందుబాటులో ఉంటూ అనేక సర్వేలు చేసి ప్రజలకు అంటురోగాలు ప్రబలకుండా మా ఆరోగ్యాలు, కుటుంబ సభ్యుల ఆరోగ్యాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. 300నుండి 4000 ఉన్న పాపులేషన్ లో కూడా ఒక ఆశా కార్యకర్తనే నియమించి పని భారాన్ని పెంచుతున్నారని, డ్యూటీ సమయంలో అనేక మంది ఆశాలు ప్రాణాలు కోల్పోయారని ఆశా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఆశా జాబ్ చాట్ లో ఆశా కార్యకర్తలకు సంబంధం లేని పనులు,ఆన్ లైన్ పనులు కొన్ని సర్వే పనులు చేయాలని ఇబ్బందులు పడుతున్నారని, ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల్లో ఉండాలనీ ఉదయం సాయంత్రం సంతకాలు చేయాలని అంటున్నారన్నారు. ఆశా కార్యకర్తలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 10వేల రూపాయలు అది కూడా రెండు సార్లు ఇస్తున్నారని సంక్షేమ పథకాలు ఆన్ లైన్ లో గవర్నమెంట్ ఎంప్లాయ్ అని వేస్తోందని కారణంగా సంక్షేమ పథకాలకు ఆశా కుటుంబాలను దూరం చేస్తున్నారని అన్నారు. 15,000 వేతనం ఇస్తామన్న హామీని అమలు చేయాలని జిల్లాలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

## మంత్రి జోగి రమేష్ అనుచిత వ్యాఖ్యలపై జనసేన ఎదురు

మైదుకూరు జులై 25, ప్రభాతవార్త



జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పై మంత్రి జోగి రమేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మైదుకూరు జనసేన నాయకులు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇందుకు వ్యతిరేకంగా నాయకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ జోగి రమేష్ ఒక మానసిక రోగి అని, నిన్న అతని దిగ జారుడు వ్యాఖ్యల పట్ల ఆయన సతీమణి, ఇంట్లో మహిళలు చీవాట్లు పెట్టినట్లు జనసేన నాయకులు గుర్తు చేశారు.ముఖ్యమంత్రి సమక్షంలో మంత్రి మాట్లాడిన మాటలకు సి.యం అభ్యంతరం తెలుపకపోగ చిరునవ్వు చిందిస్తూ ఆనందించడం ఆయన మానసిక పరిస్థితి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చని ఏద్దేవా చేశారు.ఓటమి భయం తోనే వైసీపీ నాయకులు నీచపు రాజకీయాలకు తెర లేపారని, జనసేన అధినేత జగన్ రెడ్డి భార్యని భారతి మేడం అని సంబోదిస్తే, వీళ్ళు మాత్రం ఏకవచనాలతో మహిళలను కించపరిచేలా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బురదలోని పందులు... అందరికీ బురద అంటించే విధంగా వైసీపీ లోని బురదజాతి మంత్రులు, ప్రజాప్రతినిధులు పందులకంటే హీనంగా దిగజారి మాట్లాడటం పట్ల రాష్ట్రవ్యాప్తంగా జనసేన శ్రేణులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. వారాహి యాత్రతో ప్రజల్లో జనసేనకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు వ్యక్తిగత సహానానికి, ఇంట్లో మహిళల పట్ల అభ్యంతరకరంగా మాట్లాడటం వారికి పట్టుకున్న ఓటమి భయానికి నిదర్శనం అని తెలియజేశారు.మైదుకూరు జనసేన సీనియర్ నాయకుడు గోశెట్టి చిలుంగారి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో రామ గోవిందు, ముద్దం రమణ, విశ్వేశ్వరయ్య, గాంధీనగర్ శేఖర్, యాసం రంగా, విజయ్ కుమార్, చంద్రమౌళి, దుర్గాప్రసాద్, తేజ, హరి, అన్నమయ్య, కిరణ్ తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## హనుమంతునికి విశేష పూజలు

బద్వేలు అర్బన్, జూలై 25 ప్రభాతవార్త :



సుదర్శన జయంతి సందర్భంగా మంగళవారం సిద్దవటం రోడ్‌లో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజామునే స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకు పూజ, సింధూరం అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక ఉభయదాతలుగా శ్రీనివాస హాస్పిటల్ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డా॥ దర్భగూటి వెంకట సందీప్, సతీమణి శివ లలిత, సముద్రాల రాజేంద్ర ప్రసాద్, సతీమణి సౌజన్యం, ముల్లంగి వెంకటేశ్వర్లు, సతీమణి లీలాకుమారి కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మాడపూరు రమణ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వంద శాతం సక్షేమ పథకాలు అమలు



బ్రహ్మంగారిమఠం, జూలై 25 ప్రభాతవార్త :

మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రభునగర్, విరాట్ నగర్, జింకల నగర్‌లో శాసన సభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి వందకు వంద శాతం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇంటింటికి వెళ్ళి గ్రామస్తులతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉన్నాయా? లేక నవరత్నాల పథకాలు అందుతున్నాయా? లేదా? అని వారిని అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు మంచినీటి సమస్య, మా వీధులలో సీసీ రోడ్లు వేయించాలని ఎమ్మెల్యేను కోరగా అక్కడికి వచ్చిన అధికారులకు మంచినీటి సమస్య లేకుండా చూడాలని, సీసీ రోడ్డు పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామని, అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు.

**వీరబ్రహ్మేంద్ర స్వామి నివాస వీధికి సీసీ రోడ్డుకు భూమిపూజ:**

జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నివాసం ఉన్న వీధికి 18 లక్షల రూపాయలు వ్యయంతో సిమెంట్ రోడ్డుకు టెంకాయ కొట్టి భూమిపూజను శాసన సభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి ప్రారంభించారు. భక్తులకు, గ్రామస్తులకు రోడ్డు అపరిశుభ్రంగా ఉండడంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు కోరగా వెంటనే సీసీ రోడ్డుకు భూమిపూజ జరిగిందని, ఎలాంటి అసౌకర్యం లేకుండా సిమెంట్ రోడ్డు వేయిస్తామని ఆయన తెలిపారు. అలాగే భక్తుల సౌకర్యార్థం బస్ షెల్టర్‌ను నిర్మించాలనే ఉద్దేశ్యంతో మండల ఎంపీపీ వీరనారాయణ రెడ్డి బస్ షెల్టర్‌కు టెంకాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు శాసన సభ్యులు కుమారుడు నాగిరెడ్డి, జడ్పీటీసి రామగోవిందరెడ్డి మరియు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం




కడప వైద్యవిభాగం, జులై 25, ప్రభాతవార్త:

మహిళల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి, తెలుగు రైతు నాయకుడు లక్ష్మిరెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు జిల్లా తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహిళలకు భరోసా మహాశక్తి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలతో ప్రజలు మహిళలకు మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మహిళలకు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి కరపత్రాలను ఇంటింటికి వెళ్లి తెలుగు మహిళలు ప్రచారం చేయాలన్న ఉద్దేశంతో తెదేపా ఇన్‌ఛార్జి అమీర్‌బాబు నేతృత్వంలో మహిళల భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోతోందని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో మంది మహిళలపైన అత్యాచారాలు, మానభంగాలు, దళితులు, మైనార్టీలు, బీసీలు ఎంతో మంది బలయ్యారని అలాంటి వారి కుటుంబాలకు మా నాయకుడు మాజీ సీఎం, తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నాయత్వాన్ని బలపరిచి సీఎంగా చేస్తే రాబోయే తెదేపా ప్రభుత్వ హయాంలో తల్లికి వందనం పేరుతో ఎంతో మంది చిన్నారులు ఉన్న వారికి రూ.15వేలు ప్రతి ఏడాది తల్లుల ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1500 లబ్ధి చేకూరుతుందని మరియు ప్రతి ఏడాది 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు జలతోటి జయకుమార్, కొమ్మలపాటి సుబ్బరాయుడు, కొండా సుబ్బయ్య, బండి జయశేఖర్, సానపరెడ్డి రవిశంకర్‌రెడ్డి, గున్నిపాటి మల్లేష్, జియావుద్దీన్, భరత్, ఖాజాపీర్, శ్రీనివాసులు, ఆరీఫ్, ఓబులరెడ్డి, సుదాకర్ యాదవ్, మేకల వెంకటేష్ యాదవ్, ప్రేమ్‌కుమార్, మహిళలు, తెలుగు మహిళా నాయకురాలు వరద పార్వతి, నిర్మలమ్మ, కళావతి, మీనాక్షి, స్వర్ణలత, మాలన్‌బీ పాల్గొన్నారు.

## ఉర్దూ కళాశాల కావాలని ఎమ్మెల్యేకు వినతి



పీలేరు, జూలై 25 ప్రభాతవార్తః

పీలేరు పట్టణంలోని ముస్లీం మైనారిటీల తరఫున మాజీ సర్పంచి ఏఎస్ హుమయూన్ మాట్లాడుతూ పీలేరు పట్టణానికి నాలుగు వైపుల తిరుపతి, మదనపల్లె, రాయచోటి, చిత్తూరులకు నడిబొడ్డున ఉన్నది. కావున పీలేరులో ఉర్దూ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానిక శాసన సభ్యులు చింతల రామ చంద్రా రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని మైనారిటీలు కళాశాలకు వెళ్లాలంటే 55 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తుంది, కావున పీలేరులో కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయవలసిందిగా పీలేరు ముస్లీం ప్రజలు తరఫున విన్నవించుకున్నారు.